



మబ్బుల వాతావరణంతో బెంబేలు

ఏలూరు సిటీ/పెదపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడనుందని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో బుధవారం మబ్బుల వాతావరణం చోటు చేసుకోవడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. ఇప్పటికే కోసిన వరి పంటను రహదారులపై ఆరబోయగా, కొన్ని చోట్ల ధాన్యాన్ని కుప్పలుగా నిల్వ చేశారు.



సభ్యత్వంలో.. దూకుడు!

ఉమ్మడి పశ్చిమలో పోటాపోటీగా సభ్యత్వం

- పాలకొల్లు స్టేట్‌లోనే నెంబర్-1
- రెండో స్థానంలో ఉండి నియోజకవర్గం
- చాలా నియోజకవర్గాల్లో అనూహ్యంగా పెరిగిన శాతం
- ఏలూరు జిల్లాలో తొలిస్థానంలో ఉంగుటూరు నియోజకవర్గం



గత ఐదేళ్లపాటు రాజకీయ ఒత్తిళ్లకు భయపడకుండా నమ్మిన పార్టీ సిద్ధాంతమే ఊపిరిగా తెలుగు సైనికులు ఇప్పటికీ అదేస్థాయిలో పట్టు వీడకుండా ముందుకు వెళ్తున్నారు. పార్టీ సభ్యత్వ నమోదులో చురుగ్గా పాల్గొనాలని కోరిందే తడవుగా క్షేత్రస్థాయిలో నేతలు, కార్యకర్తలు దృష్టి పెట్టారు. ప్రత్యేక యాప్ ద్వారా టీడీపీ సభ్యత్వాన్ని వారంతా స్వీకరించేలా చేశారు. ప్రత్యేకించి గోదావరి జిల్లాల్లో టీడీపీకి పూర్తి పట్టుందన్న వాస్తవాన్ని మరోసారి రుజువు చేసుకునేలా సభ్యత్వ నమోదులో దూసుకుపోతున్నారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

పాలకొల్లు నియోజకవర్గంలో అత్యధికంగా సభ్యత్వ నమోదు జరగ్గా రాష్ట్ర, జిల్లా స్థాయిలో తొలిస్థానాన్ని దక్కించుకోగలిగింది. నియోజకవర్గాల వారీగా ఉన్న ఓటర్ల సంఖ్యలో ఎవరెవరు ఎంత శాతం మేర సభ్యత్వ నమోదు చేస్తున్నారనే అంశాన్ని శాతం రూపంలో గుర్తించి ఆ మేరకు ఆయా నియోజకవర్గాల రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో స్థానాలను టీడీపీ అధినాయకత్వం గుర్తిస్తోంది. ఈ క్రమంలోనే మంత్రి నిమ్మల రామానాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న పాలకొల్లు నియోజకవర్గం రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో తొలి వరుసలో నిలవడంతో నియోజకవర్గ పార్టీ నేతల ఆనందానికి హద్దులు లేకుండా పోయింది. ఈ నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వం 98 వేల 195కు చేరగా, లక్షకు పైగా అధిగమించాలని అక్కడి నేతలందరూ పట్టుదలతో ఉన్నారు. ఉప సభాపతి కె.రఘురామకృష్ణంరాజు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉండి నియోజకవర్గంలోను సభ్యత్వ నమోదులో రాష్ట్రం, జిల్లా స్థాయిల్లో రెండవ స్థానాన్ని ఆక్రమించారు. మొదటి నుంచి రఘురామకృష్ణంరాజు ఒక ప్రణాళిక ప్రకారం పట్టుదలతో సభ్యత్వ నమోదు ప్రక్రియను పర్యవేక్షించడంతో ఈ నియోజకవర్గంలో ఇప్పటివరకు 72 వేలకు పైగా ఇప్పటికే సభ్యత్వ నమోదు జరిగింది. ఏలూరు జిల్లాలో ఉంగుటూరు నియోజకవర్గం టీడీపీ సభ్యత్వ నమోదులో తొలిస్థానం ఆక్రమించింది. ఈ నియోజక వర్గంలో ఇప్పటికే 53 వేల మందికిపైగా టీడీపీ సభ్యత్వాన్ని స్వీకరించారు. ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఉన్న గన్ని వీరాంజనేయులు ఆది నుంచి తమ కేడర్‌ను అప్రమత్తం చేయడం, ఏ రోజుకారోజు పర్యవేక్షించడంతో ఇది సాధ్యమైంది. ప్రత్యేకించి ఉంగుటూరు నుంచి జనసేన ఎమ్మెల్యే ధర్మరాజు ప్రాతినిధ్యం వహిస్తుండగా ఇక్కడ టీడీపీ తన పట్టు పటిష్ఠంగానే ఉందనేలా సభ్యత్వ నమోదులో రుజువు చేశారు.

నియోజకవర్గాల మధ్య పోటీ

తెలుగుదేశం సభ్యత్వ నమోదులో నియోజకవర్గాల మధ్య పోటీ వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలోనే జిల్లాలో, రాష్ట్రంలో తాము వెనుకబడరాదని ముఖ్యమంత్రి చంద్రబాబు, యువనేత లోకేశ్ దృష్టిలో తాము ఖచ్చితంగా నిలబడాల్సిందేననే ధోరణిలో సభ్యత్వ నమోదులో నిర్లక్ష్యం చేయకుండా జాగ్రత్తపడ్డారు.

ఏలూరు జిల్లాలో ఏలూరు నియోజకవర్గం 49 వేల 854 సభ్యత్వ నమోదుతో రెండో స్థానంలో నిలిచింది. ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే బడేటి చంటి ఏలూరు కార్పొరేషన్ పరిధిలో అత్యధికంగా సభ్యత్వ నమోదు జరిగేలా జాగ్రత్తలు తీసుకున్నారు. కైకలూరు నియోజకవర్గంలో స్థానిక నేతలంతా ఉమ్మడిగా కష్టపడి సభ్యత్వ నమోదును 39 వేలకు పైగా తీసుకెళ్లగలిగారు. దెందులూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ 40 వేల సభ్యత్వ నమోదుతో జిల్లాలో నాల్గవ స్థానంలో ఉన్నారు. మంత్రి పార్థసారథి ప్రాతినిధ్యం వహిస్తున్న నూజివీడు నియోజకవర్గం జిల్లాలో ఐదో స్థానంలో నిలవగా అక్కడ 44 వేల 500 మందికి సభ్యత్వం ఇచ్చారు. మొత్తం ఓటర్ల సంఖ్యను పరిగణనలోకి తీసుకుని జరిగిన సభ్యత్వ నమోదును శాతం రూపంలో విశ్లేషించడంతో కొన్ని నియోజకవర్గాల్లో సభ్యత్వం ఎక్కువ జరిగినా జిల్లా స్థాయి స్థానాల్లో మార్పు మాత్రం కనిపించింది. తెలుగుదేశం పొలిట్ - మిగతా 8లో



సీఎం చంద్రబాబు నిర్వహించిన కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, తదితరులు

ప్రాధాన్యతలను మరువొద్దు..

- కలెక్టర్లకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం
- ఆక్వా సమస్యలు ప్రస్తావించిన కలెక్టర్ వెట్రిసెల్వి
- సాగునీటి పథకాల విషయంలోను జాగురత అవసరమన్న సీఎం
- కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో కీలక అంశాలపై చర్చ

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

ప్రభుత్వ ప్రాధాన్యతలను అనుగుణంగా తక్షణ చర్యలు తీసుకుంటున్నాం. ఆక్వా, జలవనరుల విషయంలో కాస్తంత వేగం పెంచాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ మార్గదర్శకా సూత్రాల అనుగుణంగానే అనుసరిస్తాం. ఆక్వాకు సంబంధించి చేప, రొయ్య, హేచరీస్ ఇక్కడ లేనందున దూర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. దీనిపైనా శ్రద్ధ పెట్టాల్సిందే. విదేశీ మారకద్రవ్యం ఆర్జించే ఆక్వాను రైతులకు సాగునీరరు అందించడం ద్వారా అత్యధిక ఉత్పత్తులకు సాధనకు వీలుగా చర్యలు తీసుకుంటున్నాం.. అంటూ ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్లు సీఎం చంద్రబాబు నాయుడుకు వివరించారు. ముఖ్యమంత్రి అధ్యక్షతన బుధవారం అమరావతిలో కలెక్టర్ల కాన్ఫరెన్స్ జరిగింది. దీనిలో వివిధ అంశాలను క్షుణ్ణంగా చర్చించారు. తొలుత ప్రభుత్వ ప్రాధాన్యతలు, వివిధ రంగాల అభివృద్ధి, ప్రజాభిప్రాయ సేకరణ, అనుకూల నిర్ణయాలు ఎప్పటికప్పుడు తాజా పరిస్థితులపై అవగాహన, విశ్లేషణ, ఫలితాలు రాబట్టడం వంటి అంశాలపై సీఎం చంద్రబాబు కలెక్టర్లకు దిశనిర్దేశం చేశారు. బుధవారం రాత్రి పొద్దుపోయే వరకు సీఎం నేరుగా కలెక్టర్ల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో ఆక్వా రంగంలోని ఒడిదుడుకులు ప్రస్తావనకు వచ్చాయి. ఆక్వా ఉత్పత్తులు పెరిగితే రాబడి కూడా అలవోకగా పెరుగుతుందని, ఇలాంటి తరుణంలో చేప పిల్లలు, రొయ్య పిల్లల ఉత్పత్తికి స్థానికంగానే హేచరీలను అభివృద్ధి చేయాల్సిన అవసరాన్ని పశ్చిమ గోదావరి కలెక్టర్ చదలవాడ నాగరాణి ప్రస్తావించగా, ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి దీనిని సమర్థించారు. అలాగే మెట్ట ప్రాంతానికి సాగునీరు అందించే చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేసేందుకు అనువుగా వేగంగా - మిగతా 8లో



బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి పశ్చిమకి ద్వితీయ స్థానం

ఏలూరు రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా మార్టేరులో 10వ అంతర్ జిల్లాల సీనియర్ పురుషుల, మహిళల బాస్కెట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు ఈనెల 7వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరిగాయి. ఈ పోటీల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా మహిళల జట్టు ద్వితీయస్థానం సాధించిందని జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు కె.కృష్ణారెడ్డి, జి.శ్రీనివాసరావు తెలిపారు. గెలుపొందిన జట్టును పలువురు అభినందించారు.

గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో ఖోఖో పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు,డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి నిరంతర సాధన చేస్తూ ముందుకు వెళ్లాలని దెందులూరు శాసన సభ్యుడు చింతమనేని ప్రభాకర్ అన్నారు. బుధవారం మండలంలోని గోపన్నపాలెం సీతారామ ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాలలో ఇంటర్ మోరల్ ఖోఖో పోటీలు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ నతానియాల్ ఆధ్వర్యంలో దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. ఖోఖో సమాఖ్య అధ్యక్ష కార్యదర్శులు పీవీ రంగారావు, ఎరుకల సాంబశివరావు, ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆదిరెడ్డి సత్యనారాయణ, జిల్లాలోని పది డిగ్రీ కళాశాలల క్రీడాకారులు పాల్గొనారు


కరాటే విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

కరాటే పోటీల విజేతలకు అభినందనలు

భీమవరం టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చిన్న వయసులోనే కరాటేలో రాణించి విదేశాల్లో విజేతలుగా నిలవడం గొప్ప విశేషమని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఇటీవల మలేషియాలో జరిగిన కరాటే పోటీల్లో మూడు పతకాలు సాధించిన భీమవరం విద్యార్థులను శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బ్యాంక్ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే అంజిబాబు, సతీమణి సత్యవాణి అభినందించారు. రంగసాయి మాట్లాడుతూ మలేసియా దేశంలో జరిగిన కరాటే పోటీల్లో భీమవరం ఇమ్మాన్యుయేలు అనాధ ఆశ్రమానికి చెందిన నేతల అశ్విని, దండే ప్రియ, బత్తుల జెస్సీలు బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించారని, వీరు భీమవరం ఎస్‌జెజీఎం హైస్కూల్లో చదువు తున్నారన్నారు. ఆశ్రమ నిర్వాహకులు పాల్, జ్యోసుల విజయ్ భాస్కర్, గంధం శ్రీదేవి పాల్గొన్నారు.

14న భీమవరంలో జిల్లా స్థాయి ఆర్చరీ పోటీలు

భీమవరం అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా స్థాయి సబ్ జూనియర్స్ ఆర్చరీ పోటీలు ఈ నెల 14వ తేదీ శనివారం భీమవరం వంశీ కృష్ణ నగర్‌లోని ఓల్గా ఆర్చరీ అకాడమీ నందు నిర్వహించనున్నట్లు ఆర్చరీ జిల్లా అసోసియేషన్ జిల్లా సెక్రటరీ ఎల్.జయరాజు తెలిపారు. ఈ పోటీలో విజేతలు ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు రాజమండ్రిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో జిల్లా తరుపున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. పోటీల్లో పాల్గొన దలచిన వారు 01-01-2007 తర్వాత జన్మించి వారై ఉండాలని వారి ఆధార్ కార్డు, పుట్టిన తేదీ సర్టిఫికెట్, పాస్‌పోర్టు ఫొటోలు రెండు చెప్పున తీసుకుని పోటీలకు హాజరు కావాలని వివరించారు. వివరాలకు 84998 72291 నంబర్‌లో సంప్రదించాలన్నారు.



పందిరి రాట నిలబెడుతున్న కమిటీ సభ్యులు.. మావుళ్లమ్మ ఆలయానికి తాళం వేసిన దృశ్యం

మావుళ్లమ్మ ఉత్సవాలకు శ్రీకారం

పందిరి రాట నిలబెట్టిన కమిటీ సభ్యులు

ఈసారి ఉత్సవాలు 33 రోజులు

భీమవరం టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నీరుల్లి, కూరగాయ పండ్ల వర్తక సంఘం, మావుళ్ళమ్మ ఉత్సవ కమిటీ, దేవస్థానం ఆధ్వర్యంలో వచ్చే నెలలో జరిగే మావుళ్ళమ్మ అమ్మవారి 61వ వార్షిక జాతర మహోత్సవాలకు కమిటీ ఆధ్వర్యంలో బుధవారం పందిర రాట ముహూర్తం చేశారు. నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం అధ్యక్షుడు తుటారపు ఏడుకొండలచే ఆలయ ప్రధానార్చకులు మద్దిరాల మల్లిఖార్జునశర్మ ప్రత్యేక పూజలను చేయించారు. ఉదయం 9-30 నిమిషాలకు పందిర రాటను నిలబెట్టారు. ఈ ఏడాది 33 రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. జనవరి 13వ తేదీ నుంచి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, ఉత్సవ కమిటీ నాయకులు కొప్పుల సత్యనారాయణ (సత్తిబాబు), రామాయణం గోవిందరావు, రామాయణ సత్యనారాయణ, శ్రీనివాసరావు, నరహరశెట్టి అబ్బులు, మానే బాస్కరరావు, తేజ, ఈవో బుద్ధ మహాలక్ష్మి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

మూల విరాట్ దర్శనం నిలిపివేత

వార్షిక మహోత్సవాలు సందర్భంగా అమ్మవారికి రంగులువేసే నిమిత్తం బుధవారం నుంచి అమ్మవారి దేవాలయ మూల విరాట్ దర్శనాన్ని నిలిపివేశారు.ఇందులో భాగంగా ఆలయ ప్రధాన అర్చకుడు మల్లిఖార్జునశర్మ అధ్వ ర్యంలో తాళ్ళపూడికి చెందిన జంధ్యాల గంగా ధర్ శాస్త్రి పర్యవేక్షణలో కళాపకర్షణ పూజలు నిర్వహించారు.విఘ్నేశ్వరపూజ, మండపారాధన, హోమాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారి కళలను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కలశంలో నిక్షిప్తం చేశారు. కలశాన్ని వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలతో ఆలయ వెనుక భాగంలో ఏర్పాటు చేసిన బాలాలయంలో ఉంచి ప్రత్యేక పూజలు చేశారు. ఈ నెల 24 వరకు ఇక్కడే పూజలు నిర్వహిస్తారు.

ఆంధ్రజ్యోతి ఫోకస్



భీమవరంలో నో పార్కింగ్ బోర్డు వద్ద ఆటో నిలిపిన దృశ్యం




ఏలూరులో రోడ్డపక్కన బైక్‌లు పార్కింగ్ చేయడంతో కారు వెళ్లేందుకు ఇబ్బంది..

మా ఇష్టం..

ఏలూరు, భీమవరంలో అడుగు పెట్టాలంటే అంతా గజి బిజి గందరగోళం..ఎక్కడ పడితే అక్కడ ఇష్టానుసారంగా వాహనాలను నిలిపివేయడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి..వాహనాలను అడ్డంగా నిలిపివేయడంతో కార్లపై వెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు.. ఆ వాహనం తీసేవరకు కారు కదిలే పరిస్థితి ఉండదు.. కొన్ని చోట్ల అయితే సగం రోడ్డు వాహనాలతోనే నిండిపోతుంది...

భీమవరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం రోడ్డులో కారు మధ్యలో ఆపి వేయడంతో నిలిచిపోయిన ట్రాఫిక్

ఏలూరులో సగానికి పైగా రోడ్డును ఆక్రమించి బైక్‌లను పార్క్ చేసిన దృశ్యాలు






పీచు పరిశ్రమకు గడ్డుకాలం



మార్కెట్‌కు చైనా దెబ్బ
కరోనా తర్వాత తగ్గిన ఎగుమతులు
గతంలో రూ.180 కోట్లు టర్నోవర్
ప్రస్తుతం రూ.100 కోట్లకు పతనం
నష్టాలు తట్టుకోలేక మూసివేస్తున్న యజమానులు



దెందులూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి పశ్చిమలో కొబ్బరి పీచు పరిశ్రమ ద్వారా యజమానులు లాభాలతో పాటు వేలమంది కార్మికులు ఉపాధి పొందేవారు. కానీ కరోనా తర్వాత చైనా మార్కెట్ లేకపోవడంతో కాలక్రమేణా కొబ్బరి పీచు పరిశ్రమలు తగ్గిపోతున్నాయి. పీచు పరిశ్రమ ద్వారా దెందులూరు, పెదవేగి, ద్వారకాతిరుమల, పెరవలి, అత్తిలి, ఉంగుటూరు తదితర మండలాల్లో పెద్ద స్థాయిలో చిన్నతరహా కొబ్బరి పరిశ్రమలు ఉన్నాయి. కొబ్బరి పీచును ఎక్కువగా సోఫా సెట్లు, కార్పెట్లు, పరుపులు, తాళ్ల తయారీలో వినియోగిస్తారు. ప్రధానంగా మన రాష్ట్రం నుంచి చైనాకు కొబ్బరి పీచు ఎగుమతులు అవుతాయి ప్రభుత్వ లెక్కల ప్రకారం పీచు పరిశ్రమ ద్వారా సంవత్సరానికి ఉమ్మడి జిల్లాలో రూ.180 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతూ ఉండేవి. నెలకు 15 టన్నుల ఉత్పత్తి చేస్తూ ఆరు వేల మంది ఉపాధి పొందేవారు. కరోనా తర్వాత చైనా మార్కెట్ తగ్గడంతో రైతులు నష్టాలు వస్తుండడంతో చిన్నపరిశ్రమల దారులు పీచు పరిశ్రమను మూసివేస్తున్నారు. ప్రస్తుతం రూ.100 కోట్లకు వ్యాపార లావాదేవీలు పడిపోయాయి.

పీచు తయారీ ఇలా..

కొబ్బరి తోటల నుంచి కూలీల ద్వారా కొబ్బరి డొక్కలను సేకరించి పరిశ్రమల ద్వారా పీచు ఉత్పత్తి చేయగా మిగిలిన పొట్టును ఇటుకల బట్టీలకు విక్రయిస్తుంటారు. పరిశ్రమ వద్దకు తెచ్చిన డొక్కను పీచు తయారు చేయడానికి కనీసం నెల రోజుల వ్యవధి పడుతుంది. కిలో పీచు తయారీకి కూలీలు, యంత్రాల నిర్వహణ ఖర్చు ఎనిమిది రూపాయలు అవుతుంది. కరోనా తర్వాత కిలోకు 8 నుంచి 9 రూపాయలే ధర వస్తుండడంతో గిట్టుబాటు కావడం లేదని నిర్వా హకులు వాపోతున్నారు. వ్యవసాయ అనుబంధ పరిశ్రమ అయిన కొబ్బరి పీచు పరిశ్రమ అభి వృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సబ్సిడీ రుణాలు, రాయితీపై విద్యుత్ అందించాలని నిర్వాహకులు కోరుతున్నారు.

నష్టాలు రావడంతో మూసివేశా



కొబ్బరి పీచు పరిశ్రమలకు విద్యుత్‌లో రాయితీ కల్పించాలి. కరోనా తర్వాత ఆశించినంతగా మళ్లీ ఎగుమతులు లేవు. ఖర్చులు పెరిగి నష్టాలు వస్తుండడంతో పరిశ్రమ నడపలేక మూసివేశాను.

-తిరుమలరావు, విజయరాయి

విద్యుత్ రాయితీ ఇవ్వాలి



కొబ్బరి పీచు పరిశ్రమ చిన్న తరహా పరిశ్రమ కావడంతో మార్కెట్ హెచ్చు తగ్గులు వల్ల ఎగుమతులు నిలిచిపోతుంటాయి. ఆ సమయంలో తయారైన పీచును నిల్వ చేసుకునేందుకు గోదాములు లేక ఇబ్బందులు పడుతున్నాం. వర్షాలు, అగ్నిప్రమాదాల కారణంగా నష్టపోతున్నాం. ప్రభుత్వం చిన్న పరిశ్రమలకు 80 శాతం రాయితీతో విద్యుత్‌ను అందించాలి.

పి.అచ్యుత రామరాజు,జోగన్నపాలెం

కనువిప్పు గలిగించే 'అనూహ్యం'

తోలేరులో ముగిసిన జాతీయస్థాయి నాటిక పోటీలు



(వీరవాసరం) భీమవరంటౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వీరవాసరం మండలం తోలేరులో నిర్వహిస్తున్న జాతీయస్థాయి అలరిస్తున్నాయి. బుధవారం ప్రదర్శించిన అనూహ్యం నాటకం నేటి సమాజంలో తల్లి తండ్రులు సంపాదించిన ఆస్తులను ఎలా దక్కించుకోవాలనే చేసే కుటిల యత్నాలను, మోసాలను తండ్రి గ్రహించి ఎలా బుద్దిచెప్పాడనేది ఈ నాటిక సారాంశం...పాలకొల్లుకులోని నటీనట సంక్షేమ సమాఖ్య అధ్వర్యంలో ప్రదర్శించిన అనూహ్యం చూసిన ప్రేక్షకులను ఆలోచింపచేసింది. పిల్లలపై మమకారం పెంచుకుంటున్న తల్లితండ్రులకు ఈ నాటిక కనువిప్పు కలిగించడం ఖాయం. కొడుకులు వారసత్వ సంపదను అనుభవించడం కోసం బిచ్చగాళ్ళలా ఎదురు చూడకుండా స్వయం కృషితో ఆత్మాభిమానంతో జీవించాలనే సందేశంతో ఈ నాటిక సాగింది. ఇందులో ప్రతీ పాత్రదారుడు ఎంతో అద్భుతంగా నటించారు. తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచయిత కాగా కత్తుల రామ్ మోహన్ దర్శకత్వం వహించారు. అదే విధంగా గుంటూరుకు చెందిన అభినయ ఆర్ట్స్ ప్రదర్శించిన 'ఇంద్రప్రస్థం' నాటిక ఆకట్టుకుంది. ఈ నాటికల ప్రదర్శనతో జాతీయస్థాయి నాటిక పోటీలు ముగిశాయి. విజేతలకు గురువారం బహుమతి ప్రదానం నిర్వహించనున్నారు.



పోలవరం డీఎస్పీ కార్యాలయానికి కొత్త కళ

పోలవరం డీఎస్పీ కార్యాలయం జాతీయతా భావం ఉట్టిపడేలా జాతీయ జెండా రంగులతో కళకళలాడుతోంది. పోలవరం సబ్ డివిజన్ ఏర్పడిన తర్వాత ఆరుగురు డీఎస్పీలు సబ్ డివిజన్ పరిధిలో పని చేశారు. నూతన డీఎస్పీగా వెంకటేశ్వరరావు బదిలీపై వచ్చిన తర్వాత పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ ఆధ్వర్యంలో కార్యాలయానికి రంగులు వేయించారు. కళకళ లాడుతున్న కార్యాలయం అక్కడికి వచ్చే అధికారులు, సిబ్బంది దృష్టిని విశేషంగా ఆకర్షిస్తున్నది.

- పోలవరం

వచ్చేనెల 10న శ్రీవారి ఉత్తర ద్వారదర్శనం

ద్వారకాతిరుమల, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని వచ్చేనెల 10న శ్రీవారి ఉత్తరద్వార దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ ఈవో ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు. ఆరోజు తెల్లవారు జామున 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ఉత్తరద్వారం వద్ద శ్రీవారు ఉభయ దేవేరులతో వెండి గరుడ, శేష వాహనాలపై కొలువై భక్తులకు దర్శనమిస్తారని వివరించారు. అదేరోజు సాయంత్రం నుంచి ప్రారంభమై 20 వరకూ అధ్యయనోత్సవాలు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా ఆయా రోజుల్లో రాత్రివేళ జరిగే ఆర్జిత ఉత్సవాలు రద్దు చేస్తున్నట్లు చెప్పారు. సంక్రాంతి నాడు స్వామివారి ఆర్జిత కల్యాణం రద్దు చేస్తున్నట్లు వివరించారు. జనవరి 9న తొలిమెట్టు నుంచి స్వామివారి శేషాచలం చుట్టూ మధ్యాహ్నం 2.30 గంటలకు గిరిప్రదక్షిణ ప్రారంభమవు తుందని గిరిప్రదక్షిణ అనంతరం స్వామివారి నిజరూప దర్శనం ఏర్పాటు చేశామని ఈవో వివరించారు.

భీమేశ్వరస్వామి ఆదాయం రూ.3.15 లక్షలు

భీమవరం టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భీమవరం పట్టణంలో ఉన్న శ్రీ భీమేశ్వర స్వామి దేవాలయంలో హుండీల ఆదాయం బుధవారం లెక్కించగా 9 నెలలకు గాను 2 లక్షల 34 వేల 148 రూపాయిలు ఆదాయంగా వచ్చిందని ఆలయ ఇవో తోట శ్రీనివాస రావుతెలిపారు.. కార్తీక మాసం, సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా దర్శనం,అభిషేకం టికెట్స్ ద్వారా రూ 81,040 వచ్చిందని వివరించారు మొత్తం 3 లక్షల 15 వేల 188 రూపాయిలు ఆదాయంగా వచ్చిందన్నారు.

ఆదర్శమైన జీవన విధానానికి ఆధ్యాత్మిక తత్వం అవసరం

డాక్టర్ ఉమర్ అలీషా

అత్తిలి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆదర్శమైన జవన విధానానికి ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక తత్వాన్ని అలవర్చుకోవాలని పిఠాపురం విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ అలీషా అన్నారు. అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్టి ఉత్సవాలు సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక ఉపన్యాసం ఇచ్చారు. బాల్యదశ నుంచి క్రమశిక్షణతో కూడిన ఉన్నత విలువలను పెంపొందించుకోవాలని కోరారు. భగవద్గీత మానవ నడవడికను తెలియజేస్తుందన్నారు. త్రయ సాధన ద్వారా మానవ జీవన విధానాన్ని ముక్తిమార్గంతో పయనించేలా చూసుకోవాలన్నారు. రెడ్డి ఉషారాణి తాత్విక జ్ఞాన ఉపన్యాసం ఇచ్చారు. పోలిశెట్టి ఉషాపావని భక్తి గీతాలను ఆలపించారు. గీతావధాని యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు పీఠం ప్రాధాన్యతను వివరించారు. ఉమర్ అలీ షాను షష్టి కమిటీ సభ్యులు సత్కరించారు. పీఠం కన్వీనర్ ఆడబాల వెంకటరత్నం, ఇర్రి ప్రసాద్, నందం తాతాయ్య పాల్గొన్నారు.



ఘనంగా సహస్ర దీపారాధన

ముదినేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): షష్టి కల్యాణోత్సవాల సందర్భంగా ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో బుధవారం సహస్ర దీపారాధనలు, సహస్ర లింగార్చన వైభవంగా జరిగాయి. స్వామి వార్లకు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజలను అర్చకులు తోలేటి వీరభద్రశర్మ, గూడూరు రామకృష్ణ శర్మ నిర్వహించారు.

పెట్టుబడి కూడా రావడం లేదు



ఎకరం భూమిలో బంతి తోట సాగుచేశాను. బిగ్‌బాల్ రకం విత్తనం ఎకరాకు పదివేల వరకు నాటాను. దసరా పండుగ ముందు వరకు పంట దిగుబడి బాగా ఉండటంతో కిలో పూలధర వంద రూపాయల వరకు పలికింది. ప్రస్తుతం మండలంలో బంతితోటలు ఎక్కువగా ఉండటంతో పాటు వరుసగా కురుస్తున్న వర్షాలతో కొంతమేర బంతి తోట దెబ్బతింది. కిలో నలబై రూపాయలన్నా కొనడం లేదు. ఏలూరు మార్కెట్‌కు తీసుకువెళ్లి తక్కువ ధరకు అమ్ముకోవలసి వస్తుంది. ఎకరాకు యాభైవేల రూపాయల వరకూ పెట్టుబడి పెట్టాను. పెట్టుబడి రావడమే గగనంగా మారింది.

-జుజ్జూరి శివయ్య, రైతు, కొత్తపల్లి, లింగపాలెం మండలం



భారమైన బంతి సాగు

పడిపోయిన ధరలు
ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న పంట
గిట్టుబాటవక రైతుల ఇబ్బందులు

లింగపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): తక్కువ సమయంలో పంట చేతికివచ్చి ఎక్కువ ఆదాయాన్ని అందించే బంతి పూలతోటల సాగుకు రైతులు ముందుకొస్తున్నారు. సీజన్‌లకు అణుగుణంగా బంతిపూలను మార్కెట్‌లో కిలో ఎనభై రూపాయల నుంచి వంద రూపాయల వరకు విక్రయిస్తున్నారు. పెళ్లిళ్లకు, పండుగల సమయంలో బంతిపూలకు ఎక్కువగా డిమాండ్ ఉంటుంది. ఎకరాకు యాభైవేల నుంచి అరవైవేల వరకు ఖర్చు అవుతుంది. ధర బావుంటే లక్షన్నరకుపైగా ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. ఇటీవల వచ్చిన పండుగల సీజన్ వరకు లాభాలు తెచ్చిపెట్టిన బంతిపూలపంట దసరా తర్వాత ధరలు తగ్గి రైతులకు కొంత మేరకు నష్టాలు మిగిల్చాయి.ఇటీవల కురుస్తున్న వర్షాలకు బంతిపూల తోటలు దెబ్బతిన్నాయి. కిలోవంద పలికిన పూలధర నేడు ముప్పై రూపాయలకు కూడా కొనడం లేదంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్నాం



ఉద్యానశాఖ ఆధ్వర్యంలో రైతులకు పూలతోటలు, పండ్ల తోటలపై శాస్త్రవేత్తలతో ప్రతి పదిహేను రోజులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. పూలసాగులో బంతి తోటలు ముఖ్యమైనవి. బంతితోటలు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను అందిస్తాయి. ప్రణాళికా బద్ధంగా పూలతోటల సాగు చేస్తూ సరైన యాజమాన్య పద్ధతులను పాటిస్తే అధిక దిగుబడులను సాధించవచ్చు. బంతి తోటలకు లద్దెపురుగు, నులిపురుగు, మొగ్గకుళ్లు, వేరుకుళ్లు లాంటి తెగుళ్లు వచ్చే అవకాశం ఉంటుంది. సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. పూలు, పండ్ల తోటలు సాగుచేసే రైతులు ఉద్యానశాఖ అధికారులను సంప్రదిస్తే తోటలను పరిశీలించి పంటలో తెగుళ్ల నివారణకు సరైన సూచనలు ఇస్తారు.


షాఫియా పర్వీన్, ఉద్యానశాఖ అధికారిణి, లింగపాలెం మండలం

శరవేగంగా డయాఫ్రం గైడ్ వాల్ నిర్మాణం


పోలవరం ప్రాజెక్టులో డయా ఫ్రం వాల్ గైడ్ వాల్ నిర్మాణ పనులు

- 80 మీటర్ల వరకు కాంక్రీటు పనులు పూర్తి
- తవ్వకాలు జరిపేందుకు ట్రెంచ్ కట్టర్లు సిద్ధం
- వరదలకు దెబ్బతిన్న రోడ్డు 90% పూర్తి

పోలవరం డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అతి కీలకమైన నూతన డయా ఫ్రం వాల్ నిర్మాణానికి అవసరమైన గైడ్ వాల్ పనులు ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 16న ప్రాజెక్టు వద్దకు వచ్చి.. నిర్మాణ పనుల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు వివిధ కట్టడాల పనులను వేగవంతం చేశారు. నూతన డయా ఫ్రం వాల్ నిర్మాణానికి అవసరమైన ప్లాట్‌ఫారాన్ని సిద్ధం చేశారు. వాల్ నిర్మాణ ప్రాంతానికి ఇరువైపులా ఐదు గైడ్‌వాల్స్ కాంక్రీట్ పనులు వేగంగా చేస్తున్నారు. ఇప్పటికే 80 మీటర్ల మేర ఈ కాంక్రీట్ పనులు పూర్తి చేశారు. గతంలో మాదిరిగా ఈ సారి కూడా డయాఫ్రం వాల్‌ను 1,396 మీటర్ల పొడవున, ఐదు మీటర్ల వెడల్పున నిర్మిస్తున్నారు. గోదావరి అడుగున ఇసుక సిల్టు, మట్టిపొరల నుంచి ఎర్త్‌కం రాక్ ఫిల్(ఈసీఆర్‌ఎఫ్) డ్యాంలో సీపేజీ రాకుండా నివారించే ప్రక్రియలో భాగంగా నూతన వాల్ నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం నదీతలం అడుగు భాగాన సుమారు 100-150 మీటర్ల లోతు వరకూ ప్రాంతాన్ని బట్టి రాతి పొరలు తగిలే వరకూ తవ్వకాలు జరిపేందుకు ట్రెంచ్ కట్టర్ యంత్రాలను సిద్ధం చేశారు. ఈ యంత్రాలను వినియోగానికి అనువుగా బిగించడానికి సుమారు 20 రోజులు పడుతుందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. గత 5 నెలలుగా డయాఫ్రం వాల్ ప్రాంతంలో ఇరువైపులా శాండ్ ఫిల్లింగ్, మట్టి , ఇసుక రాతి నమూనాల సేకరణ పనులు నిర్వహిస్తున్నారు. ఈసీపీటీ యంత్రంలో కెమెరా ప్రెషర్ ద్వారా సెన్సర్‌లను భూమిలోకి పంపి ల్యాప్‌ట్యాప్ డిస్‌ప్లే ద్వారా నదిలో మట్టి, రాతి పొరల స్థితిగతుల అంచనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈసీఆర్‌ఎఫ్ డ్యాం గ్యాప్-2 ప్రాంతంలో వైబ్రో కంపాక్షన్ పనులు నిర్వహించడం ద్వారా భూమిని గట్టిపరిచే పనులు వేగవంతంగా చేస్తున్నారు. వాల్ ప్రాంతానికి మట్టి, రాళ్ల తరలించేందుకు స్పిల్ చానల్ నదీ ప్రవాహంపై ఈ ఏడాది వరదలకు దెబ్బతిన్న రోడ్డును 90 శాతం వరకు పునరుద్ధరించారు. ప్రవాహానికి ఆటంకం లేకుండా ఈ రోడ్డు మార్గంలో పలుచోట్ల భారీ ఇనుప తూములను ఏర్పాటు చేశారు. మరో 100 మీటర్ల రోడ్డు పనులు ఈ వారంలో పూర్తవుతాయని ఈఈ వెంకటరమణ వెల్లడించారు. గైడ్‌వాల్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఈఈ సుధాకర్, డీఈ మల్లికార్జునరావు తెలిపారు.


రాళ్ల తరలింపునకు సిద్ధమైన రోడ్డు


సిద్ధం చేసిన ట్రెంచ్ కట్టర్ యంత్ర సామగ్రి


రామరాజు సంతాపసభలో మాట్లాడుతున్న మంత్రి నిమ్మల

ఆడిటర్ రామరాజు విగ్రహం ఏర్పాటు చేయిస్తా : మంత్రి నిమ్మల

పాలకొల్లు, డిసెంబరు 11 : ఛాంబర్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కలిదిండి రామరాజు విగ్రహాన్ని విద్యాసంస్థల ఆవరణలో ఏర్పాటు చేసేందుకు తాను బాధ్యత తీసుకుంటానని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు అన్నారు. ఇటీవల మరణించిన రామరాజు సంతాప సభ క్షత్రియ సంక్షేమ పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగింది. ఈ సందరంగా మంత్రి మాట్లాడుతూ ఎన్నో సంస్థలకు సేవలందించిన రామరాజు పేరును మున్సిపల్ కాంప్లెక్స్‌కు పెట్టడానికి కృషి చేస్తానన్నారు. ప్రతి ఏటా సంక్రాంతికి నిర్వహించే రాష్ట్ర స్థాయి వాలీబాల్‌పోటీలకు ఈసారి రామరాజు పేరుతో నిర్వహించడం జరుగుతుందని మంత్రి నిమ్మల తెలిపారు. తండ్రి వంటి రామరాజు లేని లోటు తనకు తీరనిదన్నారు. 1982 నుంచి టీడీపీ సభ్యుడిగా ఉంటూ ఎంతో సేవలు అందజేసారని తెలిపారు. క్షత్రియ సంక్షేమ పరిషత్, కాస్మో స్పోర్ట్స్ కల్చరల్ క్లబ్, ఛాంబర్ కళాశాలల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా రామరాజు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

16 మందికి సీఎం సహాయనిధి చెక్కులు

పాలకొల్లు అర్బన్: పేదల వైద్య చికిత్సకు సీఎంఆర్‌ఎఫ్ నిధులు ఎంతగానో ఉపయోగపడుతోందని మంత్రి రామానాయుడు అన్నారు. బుధవారం తన కార్యాలయంలో నియోజకవర్గంలోని 16 మంది లబ్ధిదారులకు రూ. 8.20 లక్షల చెక్కులను ఆయన అందించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల మాట్లాడుతూ గత ప్రభుత్వం కక్షలు, వేదింపులు, కేసులతో పేదవర్గాల వారిని పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ప్రతి వారం నియోజక వర్గంలోని ప్రజల వైద్య ఖర్చులకు లక్షలాది రూపాయలు తీసుకువచ్చి అందించడం జరుగుతోందన్నారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, కూటమి నాయకులు జివి, గొట్టుముక్కల గాంధీ భగవాన్‌రాజు, కోడి విజయభాస్కర్, పెచ్చెట్టి పెద్దిరాజు,బోనం నాని, ఉన్నమట్ల కపర్ధి, జక్కంపూడి కుమార్, కొల్లి కొండప్రసాద్,తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కోమటిలంక గ్రామస్థులు

'కొఠారు' సొమ్ము ఇచ్చే వరకు ఆందోళన

ఏలూరు రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): చెరువుల లీజు సొమ్ము ఇవ్వకుండా మాజీ ఎమ్మెల్యే తమ కష్టార్జితాన్ని మింగేశారని, సొమ్ము ఇచ్చేవరకు ఆందోళన కొనసాగిస్తామని, లంక గ్రామాల వాసులు హెచ్చరించారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఇంటి వద్ద కోమటిలంక, శ్రీపర్రు గ్రామస్థులు చేపట్టిన ఆందోళనను బుధవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అబ్బయ్య చౌదరి, ఆయన తండ్రి రామచంద్రరావు కలిసి తమ కష్టార్జితాన్ని దిగమింగేశారని ఆరోపించారు. కోట్లు ఖర్చుపెట్టి చెరువులు తవ్వుకున్నామని, 2019లో ఎమ్మెల్యేగా గెలిచిన అబ్బయ్యచౌదరి దౌర్జన్యంగా చేపల చెరువు లీజు సొమ్మును తనవద్దే పెట్టుకుని తమ పొట్టకొట్టారని ఆరోపించారు. కాజేసిన సొమ్ము వడ్డీతో సహా చెల్లించాలని లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చ రించారు. వీరి ధర్నాకు తిమ్మారావు గూడెం, మానూరు, లింగారావు గూడెం తదితర గ్రామా ల టీడీపీ నాయకులు మద్దతు తెలిపారు. చెరువులీజు డబ్బులు సుమారు రూ.5 కోట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొల్లేరు నాయకులు సైదు సత్యనారాయణ, పార్టీ మండల అధ్య క్షుడు నంబూరి నాగరాజు, మాజీ అధ్యక్షుడు నేతల రవి, నాయకులు మోరు రామరాజు, జయమంగళ దొరబాబు, మెంద్రు చిన్ని, జి.వెంక న్నబాబు, చేబ్రోలు జాన్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బయ్య చౌదరిపై సైదు ఫైర్

చింతమనేని కుట్ర వల్లే టీడీపీ నేతలు అసత్య ఆరోపణలు చేస్తున్నారన్న అబ్బయ్య చౌదరి వ్యాఖ్యలను కొల్లేరు సీనియర్ నాయకుడు, టీడీపీ నేత సైదు గోవర్ధన్ తీవ్రంగా ఖండించారు. మాదేపల్లిలో బుధవారం విలేకర్లతో మాట్లాడుతూ 2019లో అబ్బయ్య చౌదరి ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే సోమవరప్పాడులో వలసపల్లి చేపల చెరువు అన్యాయంగా వైసీపీ కార్యకర్తలతో పట్టుపడి చేయించిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. అనేక అరాచకాలు చేసి ఇప్పుడు చింతమనేనిని విమర్శించటం తగదని, అవాకులు, చవాకులు పేలితే సహించమన్నారు.

రేపటి నుంచి ఎస్సీ, ఎస్టీ హక్కుల వేదిక సమావేశాలు

భీమవరం టౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):ఎస్సీ ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 13, 14 తేదీల్లో విజయవాడలో రాష్ట్రస్థాయి సమావేశాలు నిర్వహించనున్నట్లు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు గరికిముక్కు సుబ్బయ్య బుధవారం తెలిపారు. తొలిరోజు విజయవాడ సిద్ధార్థ అకాడమీలో, రెండో రోజు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ భవనంలో ఉదయం నుంచి జరుగుతాయన్నారు. ముఖ్య అతిథిగా జాతీయ ఎస్సీ కమిషన్ చైర్మన్ కిషోర్ మక్వానా, అతిథులుగా సామాజిక సమరసత వేదిక జాతీయ కన్వీనర్ కే శ్యామ్ ప్రసాద్, సమరసత సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు తాళ్లూరి విష్ణు, ఎస్సీ, ఎస్టీ హక్కుల సంక్షేమ వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు, రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ పరశురాం, హాజరవుతారన్నారు. సమావేశాల్లో వేదిక హక్కులు, ఆశయాలపై వివరిస్తారని, రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ, తీర్మానం ఉంటుందని, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

మార్చి 17 నుంచి టెన్త్ పరీక్షలు

ఏలూరు అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పబ్లిక్ పరీక్షలు రెగ్యులర్, ప్రైవేటు విదార్థులకు వచ్చే ఏడాది మార్చి 17నుంచి 31వతేదీ వరకు జరుగుతాయని ఏలూరు డీఈవో వెంకట లక్ష్మమ్మ, పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో నారాయణ తెలిపారు. ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పేపర్లు మాత్రం 50 మార్కుల చొప్పున, మిగతా ప్రధాన సబ్జెక్టుల పేపర్లన్నీ 100మార్కుల చొప్పున పరీక్షలు జరుగుతాయని వివరించారు.

మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు థియరీ, ప్రాక్టికల్ పరీక్షల షెడ్యూల్ బుధవారం విడుదలైంది. వచ్చే ఏడాది మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 12గంటలవరకు పరీక్షలు జరుగుతాయి. ఉత్తీర్ణతకు తప్పనిసరి అర్హతా పరీక్షలైన నైతికత, మానవ విలువల పరీక్ష ఫిబ్రవరి ఒకటోతేదీన, పర్యావరణ విద్య పరీక్ష ఫిబ్రవరి 3న ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు సంబంధిత కళాశాలల్లోనే నిర్వహిస్తారు. ప్రాక్టికల్ పరీక్షలు జనరల్ కోర్సులకు ఫిబ్రవరి 10నుంచి 20వరకు, ఒకేషనల్ కోర్సులకు ఫిబ్రవరి 5నుంచి 20వరకు రోజుకు రెండు సెషన్లలో ఉదయం 9నుంచి 12గంటలవరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయని ఇంటర్‌బోర్డు జిల్లా అధికార వర్గాలు తెలిపాయి.

ఏలూరు జిల్లాలోని 135 జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 18,449 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 15,019 మంది చదువుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని 121 జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 19,762 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 17, 574 మంది చదువుతున్నారు.

17 అగ్నిమాపక కేంద్రాల ఏర్పాటు

అగ్నిమాపక శాఖ అదనపు డైరెక్టర్ శ్రీనివాసులు


అధికారులకు సూచనలిస్తున్న శ్రీనివాసులు

భీమడోలు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల 15వ ఆర్థిక సంఘం నిధులతో 17 కొత్త అగ్నిమాపక కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని అలాగే 35 అగ్నిమాపక కేంద్రాల ఆధునికీకరణ చేయనున్నట్లు స్టేట్ ఫైర్ అడిషనల్ డైరెక్టర్ శ్రీనివాసులు అన్నారు. భీమడోలు అగ్నిమాపక కేంద్రాన్ని బుధవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి స్థానిక అధికా రులకు తగు సూచనలు ఇచ్చారు. భీమడోలు అగ్నిమాపక కేంద్రంలో హైడ్రాలిక్ ఎక్విప్‌మెంట్ ఏర్పాటు, ఫోన్‌కాల్స్ ఎక్కువగా వస్తున్న నేపథ్యంలో దానికి అనుగుణంగా నూతన టెక్నాలజీతో ఎక్విప్‌మెంట్‌ను ఏర్పాటు చేస్తామ న్నారు. అలాగే రాష్ట్ర వ్యాప్తంగా కెమికల్ పరిశ్ర మల్లో ప్రమాదాల నివారణకు సీబీఆర్ ఎక్విప్ మెంట్‌ను ఏర్పాటు చేస్తున్నట్లుగా, వరద ముంపు ప్రాంతాల్లో మరిన్ని సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. జాతీయ రహదారిపై జరిగే రోడ్డు ప్రమాదాల్లో గాయప డిన క్షతగాత్రులను రక్షించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. భీమడోలు అగ్నిమాపక అధికారులు పాల్గొన్నారు.

విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పర్వతరావు కన్నుమూత



ఉంగుటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరుకు చెందిన విశ్రాంత ఉమ్మడి ఏపీ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుంకవల్లి పర్వతరావు (90) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈయన గత కొంత కాలంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ హైదరాబాదులో మృతి చెందారు. ఈయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఈయన స్వగ్రామమైన ఉంగుటూరులో 35 ఎకరాల భూమిని గౌతమి సేవా సంస్థకు అందించారు. 5 ఎకరాలలో గోశాల (గోపాలకృష్ణ గోశాల) నిర్మించారు. సొంత నిధులతో ఉంగుటూరులో భారతీయ విద్యా కేంద్రంను నిర్మించి విశాఖ పట్నం లోని బి.వి.కే.కు అప్పగించా రు. ఆయన మృతికి స్థానిక భారతీయ విద్యాభవన్స్ శాఖ కరస్పాండెంటు పాతూరి వంశీ కృష్ణ సంతాపం తెలిపారు.

ఏపీ నిట్‌కు విద్యుత్ కారు వితరణ

బహూకరించిన కెనరా బ్యాంక్


కారును ప్రారంభించిన డైరెక్టర్ రమణారావు

పెంటపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏపీ నిట్ అభివృద్ధిలో దాతల భాగస్వామ్యం అభినంద నీయమని ఏపీ నిట్ ఇన్‌చార్జ్ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ రమణారావు కొనియాడా రు. తాడేపల్లిగూడెం కెనరా బ్యాంకు బ్రాంచి నుంచి ఏపీ నిట్ విద్యార్థుల సౌకర్యార్థం రూ.9 లక్షల విలువైన విద్యుత్ కారును అందించారు. ఈ సందర్భంగా కారును ప్రారంభించిన డైరెక్టర్ రమణారావు మాట్లాడుతూ ఈ వాహనాన్ని విద్యార్థుల కోసం వినియోగిస్తామని విద్యార్థులు వసతి గృహాల నుంచి తరగతి గదులకు అక్కడ నుంచి వసతి గృహాలకు వెళ్లడానికి ఈ వాహనం ఉప యోగపడుతుందన్నారు. కెనరా బ్యాంకు జీఎం పిజె విజయలక్ష్మి, ఏజీఎం రామచంద్ర, తాడేపల్లిగూడెం జీఎం జనార్ధనరెడ్డి, డీన్‌లు డాక్టర్ శాస్త్రి, డాక్టర్ కురుమయ్య, డాక్టర్ జీవి వీరేశ్‌కుమార్, జయరాం, సందీప్ పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల దహనం

- సీపీఎం ఆధ్వర్యంలో నిరసన
- తక్షణం భారం తగ్గించాలన్న జిల్లా కార్యదర్శి బలరాం



నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

భీమవరం అర్బన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి):విద్యుత్ అదనపు ఛార్జీల పేరుతో సామాన్యులపై భారం వేయడం తగదని సీపీఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన కరెంట్ బిల్లులను నిరసిస్తూ బుధవారం పుచ్చలపల్లి సుందరయ్య భవనం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేసి కరెంట్ బిల్లులను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భీమవరంలో సర్వీస్ నెం.0801042523లో విద్యుత్ వినియోగం ఖర్చు రూ.27.72 అయితే ఫిక్స్‌డ్ ఛార్జీ రూ. 30, కస్టమర్ ఛార్జీ రూ. 25, ఇంధనం సర్దుబాటు ఛార్జీ-1 రూ. 267.36, ఇంధనం సర్దుబాటు ఛార్జీ -2 రూ. 102 కలిపి మొత్తం రూ. 447.33లు కట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. 6 శాతం వినియోగం బిల్లు అయితే 94 శాతం బిల్లు అదనపు భారాలు అని తెలిపారు. 2014 నుంచి వాడుకున్న విద్యుత్‌కి ట్రూ అప్ ఛార్జీలు ఇంకా వెయ్యలేదని ప్రభుత్వం చెబుతుందని, అవి కూడా వేస్తే ప్రజలపై మరింత భారం పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం విద్యుత్ బాదుడును నియంత్రిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన చంద్రబాబు ఇప్పుడు రాష్ట్రంలో స్మార్ట్ మీటర్లు బిగించడం అన్యాయమన్నారు. సూపర్ సిక్స్ అంటూ ప్రకటించి మేనిఫెస్టోకు విరుద్ధంగా ప్రజలపై భారం వెయ్యడం తగదన్నారు. పెంచిన విద్యుత్ ఛార్జీలను తక్షణం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.వాసుదేవరావు, జిల్లా కమిటీ సభ్యుడు ఎం.వైకుంఠరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్

ఉప్పుటేరులో వేటకు వెళ్లిన మత్స్యకారుడి మృతి

మొగల్తూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఉప్పుటేరులో వేటకు వెళ్ళిన మత్స్యకారుడు మృతి చెందినట్టు మొగల్తూరు ఎస్ఐ జి.వాసు తెలిపారు. పేరుపాలెం సౌత్ పంచాయతీ లైను పల్లవపాలేనికి చెందిన తిరుమాని నిరంజనరావు (24) మంగళవారం సాయంత్రం గ్రామంలోని ఉప్పుటేరులో వేటకు వెళ్ళాడు. వేట సమయంలో ప్రమాదవశాత్తు జారిపడటంతో మృతి చెందాడు. మృతుడి తండ్రి వడ్డికాసుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

వరి కోతలు కోస్తుండగా పాముకాటు.. మహిళ మృతి

పెదపాడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : పాము కాటుకు గురైన మహిళ చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసుల కథనం ప్రకారం దెందులూరు మండలం పోతునూరుకు చెందిన అడ్డారి ఆదిలక్ష్మి(40) అదే గ్రామానికి చెందిన కూలీలతో కలసి మంగళవారం కొత్తూరులో వరి కోతలు కోస్తుండగా పాము కాటుకు గురైంది. తోటి కూలీలు ఆమెను వెంటనే ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు ఎస్సై కట్టా శారద సతీష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతిరాలికి ఇద్దరు కుమార్తెలున్నారు.

యువకుడి ఆత్మహత్య

ఏలూరు క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏం కష్టమొచ్చిందో తెలీదు ఒక వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోదూరు మండలం వేడంగి గ్రామానికి చెందిన చెల్లుబోయిన సింహాద్రి (35)కి వివాహం కాలేదు. కొబ్బరికాయలు కోసే పనికి వెళ్తా ఉంటాడు. బుధవారం ఉదయం అతను పురుగుల మందు తాగి తీవ్ర అస్వస్థతకు గురికాగా కుటుంబ సభ్యులు అతనిని పాలకొల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహానికి పోస్టు మార్టంకు మార్చురీకి తరలించారు.

కాలం చెల్లిన పచ్చళ్ల అమ్మకం

ఆకివీడు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యానికి హానికరమైన వస్తువులు అమ్ముతున్న వర్తకులపై క్రిమినల్ కేసులు పెడతామని ఫుడ్ సేఫ్టీ ఉమ్మడి జిల్లా అధికారి ఎం.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో 'అటకెక్కిన ఫుడ్ సేఫ్టీ తనిఖీలు' వార్తకు స్పందించిన అధికారులు మార్ట్‌ను పరిశీలించి కాలం చెల్లిన వస్తువులు స్వాధీనం చేసుకొని, పచ్చళ్లు సీల్ చేశారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకూ ఉమ్మడి జిల్లాలో ఆరోగ్యానికి హానికరమైన వస్తువులు అమ్మినందుకు 18 క్రిమినల్ కేసులు, కాలం చెల్లిన వస్తువులు అమ్ముతున్న వారిపై 25 కేసులు నమోదు చేశామన్నారు. స్థానిక మాదివాడలో నిర్వహిస్తున్న మార్ట్‌లో కాలం చెల్లిన వస్తువులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

పచ్చళ్లకు సంబంధించి వాటిని సీల్ చేసి హైదరాబాద్ ల్యాబ్‌కు పంపుతామని, నివేదిక వచ్చిన తరువాత తదుపరి చర్యలు ఉంటాయన్నారు. వీరివెంట ఫుడ్‌సేఫ్టీ జిల్లా ఇన్‌స్పెక్టర్ ఎ. సుందరరామిరెడ్డి, నగర పంచాయతీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ టి.సాకేత్ సిబ్బంది ఉన్నారు.

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మోటారు సైకిళ్లు మాయం

ఏలూరు క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సెక్యూరిటీ వైఫల్యంతో మోటారు సైకిళ్ళు అపహరణకు గురవుతున్నాయి. బుధవారం ఏకంగా రెండు మోటారు సైకిళ్ళు అపహరణకు గురవడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉంగుటూరు మండలం నీలాద్రిపురానికి చెందిన తానంకి వినోద్‌కుమార్ ఏలూరు ప్రభుత్వాసుపత్రి తల్లీబిడ్డల విభాగంలో ఉన్న బంధువును చూసేందుకు తన కుటుంబీకులతో సహా బుధవారం సాయంత్రం వచ్చాడు. ఎంసీహెచ్ బ్లాక్ పక్కన మోటారు సైకిల్ పార్కింగ్ ప్లేసులో పార్క్ చేసి లోపలికి వెళ్ళి తిరిగి వచ్చేసరికి మోటారు సైకిల్ అపరహరణకు గురైంది. అక్కడ సెక్యూరిటీ సిబ్బంది ఎవరూ లేరని బాధితుడు వాపోతున్నాడు. బుధవారం ఉదయం ఒక మోటారు సైకిల్ ఆసుపత్రి ఆవరణలోనే అపహరణకు గురవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. సీసీ కెమేరాలు తూతూ మంత్రంగానే పనిచేస్తున్నాయి. ఆసుపత్రి అధికారులు తక్షణం సెక్యూర్టీని ప్రక్షాళన చేసి ఆసుపత్రికి వచ్చే వాహనాలకు రక్షణ కల్పించాలి. సీసీ కెమేరాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి చర్యలు తీసుకోవాలి.

బ్యూటీషియన్ మరణానికే భర్తే కారణం !

ఏలూరు క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బ్యూటీషియన్ మరణానికి ఆమె భర్తే కారణమని ఏలూరు టూ టౌన్ పోలీసులు బుధవారం అతనిని అరెస్టు చేశారు. ఏలూరు వంగాయిగూడెం ప్రాంతానికి చెందిన కాలి ప్రియాంక(25) హైదరాబాద్‌లో బ్యూటీషియన్‌గా పనిచేసేది. ఆమె తండ్రి ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. తండ్రికి సహాయంగా ఉన్న ప్రియాంకతో ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న కండ్రికగూడెంకు చెందిన తెల్లం శ్రీకాంత్ ప్రియాంకను పరిచయం చేసుకున్నాడు. తనకు ఇంకా వివాహం కాలేదని ఆమెను పెళ్లి చేసుకుని ఏలూరు కట్టా సుబ్బారావు వీధిలోని ఒక ఇంటిని అద్దెకు తీసుకుని అక్కడ కాపురం పెట్టాడు. అయితే అప్పటికే శ్రీకాంత్‌కు అదే ఆసుపత్రిలో పనిచేసే ఒక నర్సును పెళ్లి చేసుకున్నాడన్న విషయంపై వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ప్రియాంక వద్ద లక్షలాది రూపాయలు తీసుకోవడంతో గొడవలు మరింత ఎక్కువయ్యాయి. ప్రియాంక మనస్థాపానికి గురై ఈ నెల 1న ఉరి వేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది.

ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ సీఐ వైవీ రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగకల్యాణి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె మరణానికి భర్తే కారణమంటూ బుధవారం అతనిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా 14 రోజులు కోర్టు రిమాండ్ విధించింది. దీంతో అతనిని జిల్లా జైలుకు తరలించారు.

వైసీపీకి 'సంకు' గుడ్‌బై


నాగ శేషు

నిడమర్రు డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పార్టీ కోసం కష్టపడి పనిచేసిన నాయకులను, కార్యకర్తలను వైసీపీ అధినేత జగన్మోహన రెడ్డి నేటికీ గుర్తించక పోవడం వల్లే పార్టీ సభ్యత్వానికి, పార్టీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు వైసీపీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీ సంకు నాగ శేషు తెలిపారు. భువ్వ నపల్లి కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడు తూ ఓడిపోయి ఆరు నెలలు గడుస్తున్నా నేటికి నియోజక వర్గాలలోని కార్యకర్తలను ఏ మాత్రం పట్టించుకోకుండా పార్టీ ఓటమి కారణాలకు అంతర్మథనం చేయకపోవడం దారుణమన్నారు. ఆయన వెంట గల పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైసీపీ పార్టీ బాధ్యులు అభిప్రాయం మేరకు పార్టీకి రాజీనామా చేస్తున్నామన్నారు. రెండు రోజుల్లో వారందరితో చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

నగల దుకాణంలో చోరీ యత్నం

దొంగకు దేహశుద్ధి

భీమవరం క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): బంగారు వస్తువులు కొంటానని దుకాణాల్లోకి వెళ్ళి దొంగిలించుకుపోతున్న యువకుడిని వ్యాపారులు పట్టుకున్నారు. బుధవారం ఉదయం ఒక యువకుడు భీమవరంలోని బంగారు దుకాణాల మార్కెట్‌లో కలియతిరిగాడు. సుమారు 8 షాపుల్లోకి వెళ్ళి కొనుగోలుదారులా నటించడంతో వ్యాపారులు ఆభరణాలు చూపించారు. ఒక దుకాణంలో రెండు హారాలు పట్టుకుని పారిపోతుండగా ఆ వ్యాపారి కేకలు వేయగా కొంత మంది వెంటపడి పట్టుకుని దేహశుద్ధి చేసి వదిలివేశారు. తనది గునుపూడి అని మాత్రమే తెలిపాడు. అయితే తన పేరు వెల్లడించలేదు. కాగా భీమవరం రెండవ పట్టణంలోని టాక్సీ స్టాండ్ వద్ద ఇతను అనుమానంగా తిరుగుతుండగా టూటౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 3 లేడీస్ హ్యాండ్ బ్యాగులు, కొంత నగదు, నాలుగు బంగారు గాజులు, మరి కొంత బంగారం దొరికినట్లుగా సమాచారం. పోలీసులు అతనిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

15న సప్త శ్రీనివాస దర్శనం

ఉంగుటూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి) : పౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీన ఆదివారం సప్త శ్రీనివాస దర్శనం పేరుతో బస్సు యాత్ర ఏర్పాటు చేశామని తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ వై.సత్యనారాయణమూర్తి తెలిపారు. శ్రీనివాస దర్శనం అన్నవరప్పాడు, వాడపల్లి, కొడమంచిలి, అబ్బిరాజుపాలెం, అప్పన్నపల్లి, ద్వారకాతిరుమల, పారిజాతగిరిలోని వేంకటేశ్వర స్వామి ఆలయాలను దర్శించుకోవచ్చన్నారు.

ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడండి

బుట్టాయగూడెం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ నెల 14న జరగనున్న సాగునీటి సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అధి కారులు చర్యలు తీసుకోవాలని మండల ఎన్నికల అధికారి కె.రవీంద్రబాబు డీఈ, తహసీల్దార్ పీవీ చలపతిరావు కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఎన్నికల నిర్వహణకు నియమితులైన అధికారులతో ఆయన సమీక్షించారు. మండలంలో 22 సాగునీటి సంఘాలు ఉండగా 3,710 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఎన్నికల సమయంలో పాటించవలసిన నియమాలను తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు.

డిప్యూటేషన్లు రద్దు చేయాలి

ఏలూరు అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో నిర్వహిస్తున్న గురుకుల ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న 56 మంది సీఆర్టీలు, ఎస్జీటీలను ప్రత్యామ్నాయ సర్దుబాటు పేరిట సుదూర ప్రాంతాలైన కడప, కర్నూలు, చిత్తూరు జిల్లాలకు డిప్యూటేషన్లు వేయడంపై యూటీఎఫ్, నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖల నాయకులు షేక్‌ముస్తఫా అలీ, రవికుమార్, భుక్యా రాము అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఉపాధ్యాయులు వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రన్నారు. సంబంధిత జిల్లాల్లో అవుట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు కొన్ని నెలలుగా చేస్తున్న ఆందోళన కారణంగా ఏర్పడిన టీచర్ల కొరతను తాత్కాలికంగా అధిగమించేందుకు ఈ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారన్నారు. సర్దుబాట్లను జిల్లాకే పరిమితం చేయాలని, లేనిపక్షంలో తక్షణమే ఈ డిప్యూటేషన్లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

ప్రజాశక్తి బుక్ హౌస్ ప్రారంభం

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): పవర్‌పేట సుందరయ్య గ్రంథాలయం వద్ద ప్రజాశక్తి బుక్‌హౌస్‌ను రావి గోపాలకృష్ణయ్య బుధవారం ప్రారంభించారు. అనంతరం గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ ఈ బుక్‌హౌస్ ద్వారా పేద విద్యార్థులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అభ్యుదయ సాహిత్యం అందుతుందన్నారు. కార్యక్రమంలో ఎల్.వెంకటేశ్వరరావు, కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు, నారాయణరాజు, శివప్రసాద్, ఇస్సాక్, ఆదిశేషు, సుందరయ్య, బీపీఆర్ దొర, తదితరులు పాల్గొన్నారు.

26వ సీపీఎం జిల్లా మహాసభలు

టి.నరసాపురం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ఏలూరు జిల్లా 26వ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం.సుధారాణి పిలుపునిచ్చారు. మల్లప్పగూడెంలో బుధవారం జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జి.వెంకట్రావు మాట్లాడుతూ ఈ నెల 13,14,15 తేదీల్లో బుట్టాయిగూడెంలో మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీ కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల కమిటీ సభ్యులు దుర్గమ్మ, మల్లప్పగూడెం భూపోరాటం నాయకులు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం :బుట్టాయిగూడెంలో జరిగే ఏలూరు జిల్లా సీపీఎం 26వ మహా సభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా 26వ మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. నిరంతరం ప్రజాసమస్యల పరి ష్కారాల కోసం పోరాటాలు చేస్తున్న సీపీఎం మహాసభలకు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు, కర్షకులు, ప్రజలు హాజరు కావాలని కోరారు. మండల నాయకులు బి.సూర్యకిరణ్, సత్యనారాయణ, గోపి, శివయ్య, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వంలో.. దూకుడు

(ఐదో పేజీ తరువాయి)

బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణ ప్రాతి నిధ్యం వహిస్తున్న ఆచంట నియోజకవర్గం పశ్చి మగోదావరి జిల్లాలో మూడో స్థానంలో నిలవగా ఇక్కడ 32 వేల మందికి పైగా సభ్యత్వం తీసుకున్నారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న తణుకులో జిల్లాలో నాల్గవ స్థానం నిలబెట్టుకోగా ఇక్కడ 48 వేల మందికి పైగా సభ్యత్వం పొందారు. నరసాపురం నియోజకవర్గానికి ఐదో స్థానం దక్కగా ఇక్కడ 25 వేలకుపైగా సభ్యత్వ నమోదు జరిగింది. ఏలూరు జిల్లాలో పోలవరం, చింతలపూడి నియోజకవర్గాలు 6, 7 స్థానాల్లో ఉండగా, పశ్చిమ గోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం, భీమవరానికి ఇవే స్థానాలు దక్కాయి. సభ్యత్వ నమోదుకు ఇంకా గడువు మిగిలి ఉండడంతో సాధ్యమైనంత మేర వేగంగా దూసుకుపోయేందుకే ప్రయత్నిస్తున్నారు. సభ్యత్వ నమోదు జరిగిన తీరు పట్ల అటు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇటు యువనేత లోకేశ్ సంతృప్తిగా ఉన్నట్టు సమాచారం.

ప్రాధాన్యతలను మరువొద్దు..

(ఐదో పేజీ తరువాయి)

స్పందించాలన్న సీఎం చంద్రబాబుతో కలెక్టర్ ఏకీభవించారు. ఈ దిశగా ఎక్కడైనా చిన్నా చితకా అవంతరాలు ఉన్నా అధిగమిస్తామని, తద్వారా రైతులకు మేలు చేకూరేలా అన్ని చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. అలాగే పోలవరం ప్రాజెక్టు పనుల పర్యవేక్షణలోను కీలకంగా వ్యవహరించాల్సిందిగా సీఎం ఆదేశించారు. పోలవరం పరిధిలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద చర్యలు తీసుకోవడానికి, పెండింగ్ పనులు పూర్తి చేయడానికి వీలుగా చొరవ తీసుకోవాల్సిందిగా సీఎం చంద్రబాబు సూచనలు చేశారు. రైతులకు సాగునీరు ఎంత ముఖ్యమో ప్రజలకు సంక్షేమం అంతే అవసరమని ఈ దిశగా లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్లకు సూచించారు.

భూ సమస్యల పరిష్కారానికే సభలు

రెవెన్యూ గ్రామ సభల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు


జంగారెడ్డిగూడెంలో వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో రమణ

ఏలూరు రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు దోహదపడతాయని డిప్యూటీ కలెక్టర్ దేవికారాణి అన్నారు. ఏలూరు రూరల్ మండలం జాలిపూడిలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. మ్యూటేషన్లు, భూవివాదాలు, భూఆక్రమణలు తదితర అంశాలపై అర్జీలు స్వీకరించి రశీదు ఇస్తామన్నారు. ఈ సదస్సులో కేవలం ఒక్క వినతిమాత్రమే అందింది. తహసీల్దార్ బి.శ్రీనివాసరావు, వీఆర్వోలు పాల్గొన్నారు.

రహదారి సౌకర్యం కల్పించండి

బుట్టాయగూడెం : తమ పంట పొలాలకు రహదారి సౌకర్యం కల్పించాలని అంతర్వేదిగూడెం గ్రామ సచివాయలం వద్ద జరిగిన రెవెన్యూ సదస్సులో ఆదివాసీ కొండరెడ్డి గిరిజనులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. పంట పొలాలకు వెళ్లే పుంత రోడ్డు పూర్తిగా ఆక్ర మణలకు గురికావడంతో ఎగువ ప్రాంతంలో భూములు ఉన్న గిరిజనులు పొలాలకు వెళ్లలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని తహసీల్దార్ పీవీ చలపతిరావు దృష్టికి తెచ్చారు. భూములు ఒకరి పేరు, పట్టాలు మరొకరి పేరున మంజూరు చేశారని సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని కోరారు. సర్పంచ్ జె.సత్యదుర్గప్రసాద్, ఎంపీటీసీ కె.గోవిందరాజు, మాజీ సర్పంచ్, టీడీపీ సీనియర్ నాయకుడు కె.మల్లేశ్వరరావు, జనసేన మండల కార్యదర్శి బుచ్చిరాజు, అధికారులు, గిరిజనులు పాల్గొన్నారు.

● పెదపాడు : కొక్కిరపాడు, వేంపాడు గ్రామాల్లో రెవెన్యూ గ్రామసభలు జరిగాయి. రెవెన్యూ పరంగా అందిన 11 అర్జీలను తహ సీల్దారు కృష్ణజ్యోతి పరిశీలించి వాటి పరిష్కారానికి సిబ్బందికి సూచనలు చేశారు. డీపీవో, రెవెన్యూ సదస్సుల నోడల్ అధికారి కె.అనురాధ, సర్పంచ్ ఎం.రెడ్డియ్య, వి.బుజ్జి, చంటిబాబు, మండల సర్వేయర్ కోదండ రాం, వీఆర్వోలు కోటేశ్వరరావు, కృష్ణ పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణపై చర్యలు తీసుకుంటాం

చింతలపూడి : మద్దిమత్తెనగూడెంలో ఉన్న మూడు చెరువులు ఆక్రమణకు గురయ్యాయని వాటిపై చర్యలు తీసుకోవాలని రెవెన్యూ గ్రామ సభలో ప్రజలు కోరారు. వెంకికుంట, సొల్లేటి చెరువు, ముత్యాలమ్మ చెరువులు ఆక్రమించారని, వాటిలో పశువులు నీరు తాగడానికి కూడా పనికిరాకుండా ఉందన్నారు దీంతో తహసీల్దార్ ప్రమద్వర క్షేత్రస్థాయిలో చెరువులను పరిశీలించి సర్వే శాఖకు ఆదేశాలు ఇచ్చి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక అధికారి, డీఈవో వెంకటలక్ష్మ్మ, సర్పంచ్ కె.రాంబాబు, ఎంపీటీసీ పి.ప్రసాద్, ఎ.నాగు, కె.కాళీకృష్ణ, పి.నర్సారెడ్డి పాల్గొన్నారు.

● టి.నరసాపురం: మర్రిగూడెం గ్రామ సభలో రైతుల నుంచి వినతులు స్వీకరించారు. పలు సమస్యలతో కూడిన 41 దరఖాస్తులు అందినట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ తెలిపారు. తహసీల్దార్ సాయిబాబా, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ స్రవంతి, సర్పంచ్ ఎస్.బిందు, వీఆర్వోలు పాల్గొన్నారు.

● లింగపాలెం : ములగలంపాడులో భూ సమస్యలపై రెవెన్యూ సదస్సు నిర్వహించారు. భూ సమస్యలు పరిష్కరించాలని ఏడుగురు రైతులు అర్జీలు ఇచ్చినట్లు తహసీల్దార్ నజీముల్లాషా తెలిపారు. మండల ప్రత్యేకాధికారి వి.జయప్రకాష్, మండల ఎండోర్స్‌మెంట్ ఆఫీసర్ సిహెచ్ చిన్ననాగేశ్వరరావు, సర్పంచ్ ఇ.రాజేష్‌బాబు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం :పంగిడిగూడెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆర్డీవో ఎంవీ రమణ పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 26 అర్జీలు రాగా వాటిలో 20 అర్జీలను వెంటనే పరిష్కరించినట్లు తహసీల్దార్ కె.శ్లీవజోజి తెలిపారు. మండల ప్రత్యేతాధికారి కె.ప్రభాకర్, సర్పంచ్ కె.వెంకటేశ్వరరావు, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డీఎస్ చంద్రశేషు, మండల టీడీపీ అధ్యక్షుడు ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

● కామవరపుకోట :ఉప్పలపాడు సచివాలయం వద్ద రెవెన్యూ గ్రామ సదస్సు ఏర్పాటు చేసి రైతులు, ప్రజల నుంచి తహసీల్దార్ జి.ఎలీషా వినతులు స్వీకరించారు. ఆ వినతులపై విచారణ నిర్వహించారు. స్థానికులతో చర్చలు జరిపారు. ఫీల్డ్ విజిట్ కూడా చేశారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, గ్రామ రెవెన్యూ పరిపాలనాధికారి రాటాలు, నాగరాణి, కూటమి నాయకులు ఎంఎస్ రాంబాబు, ప్రతినిధులు రమాకాంత్, డోరేపల్లి నాగు, సిశ్రీను, తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం


రెవెన్యూ సదస్సులో వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనలో గ్రామ స్థాయిలో నెలకొన్న భూసమస్యల శాశ్వత పరిష్కారానికి మీభూమి, మీహక్కు కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఎమెల్యే బడేటి చంటి అన్నారు. శనివారపుపేట సచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ భూసమస్యలున్న వారి నుంచి వినతులు స్వీకరించారు. భూసమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే చంటి ఏడు విలీన గ్రామ పంచాయతీల్లో భూ సమస్యలు పరిష్కరిస్తామ న్నారు. డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి, తహసీల్దార్ జీవీ శేషగిరి, కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, చోడే వెంకటరత్నం, జీ.శ్రీనివాసరావు, రెడ్డి నాగరాజు, ఎ.రాంబాబు, పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు


గోపన్నపాలెం గ్రామ సభలో మాట్లాడుతూన్న ఎమ్మెల్యే ప్రభాకర్

దెందులూరు , డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ కార్యాలయాల చూట్టూ తిరగకుండా అధికారులే రైతుల వద్దకు వచ్చి సమస్యలు పరించేందుకు రెవెన్యూ గ్రామ సభలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. గోపన్నపాలెం, కొత్తపల్లి, వేగవరం గ్రామాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు ఎం.నారాయణప్రసాద్ (మిల్లుబాబు), తహసీల్దార్ సుమతి, ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి సత్యనారాయణ, ఎంపీడీవో శ్రీదేవి, అధికారులు, కూటమి శ్రేణులు పాల్గొన్నారు.

● పెదవేగి : రెవెన్యూ సదస్సులతో రైతులకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. చక్రాయగూడెంలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు తమ సమస్యలను సదస్సులో అధికారుల దృష్టికి తీసుకొస్తే పరిష్కా రానికి మార్గం సుగమం అవుతుందన్నారు. తహసీల్దారు ఎస్పీ.భ్రమరాంబ, ఆర్ఐ కేవీవీ.సారథి, సర్వేయర్ సత్యనారాయణమూర్తి, దేవదాయ, ధర్మదాయశాఖ ఏలూరు కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణరాజు, అధికారులు రైతులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో అందరూ భూస్వాములే


కన్నాపురంలో రైతుల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

కొయ్యలగూడెం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనంతా భూస్వాముల తోనే కొనసాగిందని ఏన్‌డీఏ కూటమి దెబ్బకు రాష్ట్రంలో భూస్థాపితమైపోయిందని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. కన్నాపురంలో ఆర్‌డీవో ఎంవీ రమణ ఆధ్వర్యంలో. తహసీల్దార్ చెల్లన్న దొర అధ్యక్షతన బుధవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో రిసర్వే పేరుతో ఒకరి పేరు మీద ఉన్న భూములను మరోకరి పేరుకు బదలాయించడం సర్వే రాళ్ళ పై నాటి ముఖ్యమంత్రి బొమ్మలు, పేర్లు వేసుకోవడంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారన్నారు. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్‌ను తీసుకువచ్చి ప్రజల ఆస్తుల్ని దోచుకునే ప్రయత్నానికి తెలేపారని దుయ్యబట్టారు. సర్పంచ్ యు.పద్మావతి, మండల జనసేన, టీడీపీ అధ్యక్షులు టి.రవి, పి.నరేష్, రాష్ట్ర బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలు బి.నిర్మలాకిషోర్, ఎంపీటీసీలు ఎస్ కే బాజీ, కె.గణపతి, సి.సుబ్రహ్మ ణ్యం, సీహెచ్. వెంకటరమణ, బి.గంట్లయ్య, ఎం.శ్రీనివాస్, జ్యేష్ట రామకృష్ణ, ఆర్ఐ మణిదివ్య, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణ కార్యక్రమాలు

చింతలపూడి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సుస్థిర గ్రామాభివృద్ధి లక్ష్యాలపై గురువారం నుంచి ఈ నెల 18వ తేదీ వరకు అధికారులకు, ప్రజా ప్రతినిధులకు రెండు బ్యాచ్‌లుగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12, 13 తేదీల్లో మొదటి బ్యాచ్‌లో 114 మంది మండల స్థాయి వెటర్నరి, ఇంజనీరింగ్, అగ్రికల్చరల్, హార్టికల్చర్, పంచాయతీ కార్యదర్శులకు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు, 17, 18 తేదీల్లో సర్పంచ్‌లు, డిజిటల్ అసిస్టెంట్‌లు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఏఎన్ఎంలు, సర్వేయర్లు, వీఆర్వోలు 113 మంది పాల్గొంటారని, మొత్తం 227 మంది ఈ శిక్షణకు విధిగా పాల్గొనాలని తెలిపారు.

● పెదవేగి : గ్రామ సర్పంచ్‌లు, సచివాలయ సిబ్బందికి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నామని పెదవేగి ఎంపీడీవో పి.శ్రీనివాస్ తెలిపారు. 12వ తేదీ ఆరు రోజులపాటు శిక్షణ తరగతులు ఉంటాయని, మండలంలోని 30 పంచాయతీలను మూడు విభాగాలుగా చేసి, ఒక్కో విభాగానికి రెండురోజులపాటు శిక్షణ ఇస్తామని, అలా 30 పంచాయతీల సర్పంచ్‌లు, సిబ్బందికి శిక్షణ ఇస్తామని ఆయన చెప్పారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

పెదపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పాతముప్పరుర సబ్‌స్టేషన్ వద్ద సాధారణ మరమ్మతుల నిమిత్తం 13వ తేదీ శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పెదపాడు ఎలక్ట్రికల్ ఏఈ వై.రాంబాబు తెలిపారు.

రేపు మండల స్థాయి సంఘాల సమావేశం

ఏలూరు రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ ఫంక్షనల్ స్థాయి సంఘాల సమావేశం ఈ నెల 13న మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వి.శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సమావేశాలు ప్రారంభమవుతాయన్నారు. రోడ్లు, భవనాలు, కల్వర్టులు, వ్యవసాయ, పశువర్ధక, విద్య, ఆరోగ్యం, పరిశుభ్రం, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు, బీసీలు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమంపై సమావేశంలో చర్చించటం జరుగుతుందన్నారు. మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు హాజరు కావాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

రేపు సావనీర్ ఆవిష్కరణ

ఏలూరు కార్పొరేషన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం ప్రచురించిన సావనీర్‌ను శుక్రవారం సీఐటీయూ కార్యాలయం వద్ద ఆవిష్కరిస్తున్నట్టు రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు నగరంలో జూన్ 15, 16, 18 తేదీల్లో రాష్ట్ర మహాసభలో నిర్వహించామని, ఆ సభల్లో వక్తలు మాట్లాడిన విలువైన ఉపన్యాసాలు, వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం వాటి మూలాలను వివరిస్తూ సావనీర్‌ను ప్రచురించామని చెప్పారు. సీవీ నారాయణ, ఎస్.రుహాన్సీ, ఎ.నాగేశ్వరరావు, పీవీ శాస్త్రి, ఎం.వసంతరావు, ఎంఎస్ నాగరాజు, కె.శ్రీనివాస్, గుబ్బల నాగేశ్వరరావు పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఇంటింటికీ కుళాయి కనెక్షన్

పోలవరం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కృష్ణారావుపేట, కమ్మరగూడెం, కృష్ణారావుపేట గ్రామాల్లో బుధవారం జలజీవన్ మిషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పజ.పుష్ప కుళాయి కనెక్షన్ పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. జనసేన నాయకులు కె.ప్రసాద్, మండల అధ్యక్షులు జి.చిన్ని , మండల ఉపాధ్యక్షులు టి.రాంప్రసాద్, ఎం.కొండ, కార్యదర్శి వై.కొండలరావు, సచివాలయ కార్యదర్శి ప్రసాద్, పి.శ్యామ్ పాల్గొన్నారు.

19 మందికి ఉద్యోగాలు

ఏలూర అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రనైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం ప్రభుత్వ ఐటీఐ ప్రాంగణంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 36 మంది యువత హాజరుకాగా, వివిధ ఉద్యోగాలకు 19 మంది ఎంపికయ్యారని ఏపీఎస్ఎస్‌డీసీ జిల్లా మేనేజర్ జితేంద్రబాబు తెలిపారు. ఐటీఐ ప్రిన్సిపాల్ రజిత, జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ అందజేత

జంగారెడ్డిగూడెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక సీతామహాలక్ష్మి స్వచ్ఛంద సంస్థ వృద్ధాశ్రమానికి డొక్కాసీతమ్మ సేవాసమితి సభ్యులు బుధవారం అన్నదాన కార్యక్రమంతో పాటు సంస్థకు గ్యాస్ సిలిండర్ అందజేశారు. సంఘ సభ్యులు కేవీఆర్ సత్యనారాయణ, కె. దుర్గాప్రసాద్, రాధా మాధవ్, సత్య మహాలక్ష్మి పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుంటే వాహనాలు సీజ్

లింగపాలెం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ లేకుంటే వాహనాలు సీజ్ చేస్తామని ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న హెచ్చరించారు. ధర్మాజీగూడెంలో బుధవారం వాహనాల తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని వాహనదారులకు జరీమానాలు విధించారు. ఏఎస్ఐ రాంబాబు సిబ్బంది పాల్గొన్నారు.

వారి రక్షణకే అభయ మహిళా రక్షక దళం

ఏలూరు క్రైం, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో అభయ మహిళా రక్షక దళం సభ్యులు బుధవారం గస్తీ నిర్వహించారు. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, బస్‌స్టాప్‌ల వద్ద రక్షక బృందాలు వెళ్ళి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఎవరైనా ఆకతాయిలు వేధింపులకు గురి చేస్తే 112కు కాల్ చేయాలని పది నిముషాల వ్యవధిలోనే పోలీసులు వెంటనే వస్తారని సూచించారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని వాట్సప్ నెంబర్ 95503 51100కు సమాచారాన్ని అందించాలన్నారు. మహిళలు, బాలికలకు రక్షణ కల్పించేందుకే జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ అభయ మహిళా రక్షక బృందం ఏర్పాటు చేశారని విద్యార్థులకు వివరించి చెప్పారు.

స్మార్ట్ మీటర్లు వద్దు చేయాలి



ఏలూరు రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్రాలు పెంచిన విద్యుత్ ఛార్జీలు, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసి ఆధ్వర్యంలో బుధవారం ఏలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఏలూరు కార్యదర్శి బి.వెంకట్రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వాన్ని గెలిపించండి, ఛార్జీలు పెంచం, స్మార్ట్‌మీటర్లు తీసుకురమ్మని హామీ ఇచ్చి ఇప్పుడు పల్లెల్లో, షాపుల్లో, గల్లీలో స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు దేని కోసం? ఎవరి కోసమని ప్రశ్నించారు. ఐఎఫ్‌టీయూ నగర ప్రధాన కార్యదర్శి వై.శ్రీనివాస రావు, సహాయ కార్యదర్శి రాంబాబు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ ప్రజల కు అనేక హామీలు ఇచ్చి ఇప్పటికే ఏ హామీ కూడా అమలు చేయలేదని, విద్యుత్ ఛార్జీలు పెంచుతూ మోయలేని భారాన్ని తీసుకువచ్చారని విమర్శించారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు వినతిపత్రం అందచేశారు. ఎం.అప్పారావు. వీరినాయుడు, ఆర్.నూకరాజు పాల్గొన్నారు.

8 లక్షల మంది రైతులకు శిక్షణ



ఏలూరు టూ టౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లలో రాష్ట్రానికి చెందిన 8 లక్షల మం ది రైతులకు శిక్షణ ఇచ్చామని రెండు వేల నూతన వంగడాలను ఆవిష్కరించినట్లు కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ సహాయ మంత్రి బగిరత్ చౌదరి, రామ్‌నాథ్ ఠాగూర్ పార్లమెంట్‌లో తెలిపారు. శీతా కాల పార్లమెంట్ సమావేశాల్లో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ బుధవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నలకు మంత్రులు లిఖిత పూర్వక సమాధానాలు ఇచ్చారు. నిరుద్యోగ యువత 2, 300 మందికి శిక్షణ ఇచ్చామని, స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు ఏడు రోజుల స్వల్పకాలిక నైపు ణ్య శిక్షణను కేంద్రం అమలు చేస్తుందని తెలిపా రు. ఉద్యాన రైతులకు, గ్రామీణ యువతకు నేషన ల్ స్కిల్ డెవలప్‌మెంట్ మిషన్ ద్వారా 20 గంటల నైపుణ్య శిక్షణను కేంద్రం అందిస్తుందన్నారు. జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ ద్వారా డ్రోన్ అప్లికే షన్లపై స్వయం సహాయ సంఘాల మహి ళలకు, రైతులకు కేంద్రం శిక్షణ ఇస్తుందన్నారు. ప్రతీకూల వాతావరణ పరిస్థితులు తట్టుకునే నూ తన వంగ డాల అభివృద్ధికి పరిశోధనలు నిర్వహి స్తున్నామ న్నారు. సీడ్ విలేజ్ కార్యక్రమం క్రింద రుణధాన్యా ల పంపిణీకి 50 శాతం రాయితీ ఇస్తు న్నామన్నా రు. పప్పు ధాన్యాలు, నూతనెగింజలు, పచ్చిరొట్ట విత్తనాలు, 60 శాతం రాయితీతో రైతు లకు సరఫరా చేస్తున్నామని మంత్రులు తెలిపి నట్లు ఎంపీ మహేష్ వివరించారు.

ఈత పోటీల్లో ప్రతిభ


పతకాలు సాధించిన క్రీడాకారులు

ఏలూరు రూరల్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఈత పోటీల్లో ఏలూరు జిల్లా యువకులు ప్రతిభ చాటారు. ఇటీవల విశాఖపట్నం స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖలో 9వ ఆంధ్రప్రదేశ్ సబ్‌జూనియర్, జూనియర్, వింటర్, ఆక్వాటిక్, స్విమ్మింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీలో ఏలూరు జిల్లా స్విమ్మింగ్ క్రీడాకారులు ఐదు స్వర్ణం, 10 రజిత, 17 కాంస్య పతకాలు సాధించారు. వీఆర్‌వీవీ భవానీకార్తీక్ బంగారు పతకం, పి.రఘురామ్, ఎస్‌కే హఖిల్ రజిత పతకాలు, ఎస్‌కే హకీమ్, పి.రఘురామ్ కాంస్య పతకాలు, ఎం.ధనుష్‌సాయి కాంస్య, వెండి, రజిత పతకాలు సాధించారు. వ్యక్తిగత పోటీల్లో రజిత పతకాన్ని సాధించారు. స్వామినాయుడు మూడు విభాగాల్లో బంగారు పతకాలతోపాటు అత్యంత వేగవంతమైన ఈతగాడిగా రికార్డు సాధించారు. బాలికల విభాగంలో పి.శ్రగ్విత, సిహెచ్ పూర్వి, కాంస్య, జె.యశశ్విని, ఎమ్డీ సిద్రా రజిత, యు. మోహనదీప్తి కాంస్య పతకాలు సాధించారు. విజేతలను జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఈ.శ్రీనివాస్, స్విమ్మింగ్ కోచ్ గణేష్, ఆక్వాటిక్ స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఐ.మల్లిఖార్జున్‌రావు అభినందించారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తాం

ఏలూరు టూ టౌన్, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): నగర పాలక సంస్థలో క్లీన్ ఆంధ్రప్రదేశ్ వాహన డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వాహనడ్రైవర్లు ఎమ్మెల్యే చంటిని కలిసి సమస్యలు వివరించారు. అనంతరం ఎమ్మె ల్యే చంటి మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్ దృష్టికి డ్రైవర్ల సమస్యలు తీసుకెళ్ళి పరిష్కరిస్తానని అన్నారు. బి.కిశోర్, ఎం.హనుమంతరావు, చందు, బాలాజీ, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

శ్మశానానికి దారి కేటాయించాలి

జీలుగుమిల్లి, డిసెంబరు, 11 (ఆంధ్రజ్యోతి) : శ్మశానానికి దారి కేటాయించాలని, దళితులకు ఇళ్ల స్థలాలు ఇప్పించాలని పుచికపాడు రెవెన్యు సదస్సులో స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. గ్రామ కంఠం భూమిఉన్న ప్రాంతం గుర్తించి ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. పుచికపాడులో బుధవారం డీఎల్‌పీవో రజావుల్లా ఆధ్యక్షతన రెవెన్యు సదస్సు నిర్వహించారు. ఆయా సమస్యలపై అధికారులకు వినతి పత్రం అందజేశారు. జెడ్పీటీసీ మల్లం వసంత్, వీఆర్వో తిరుపతమ్మ, దాసరి బాబ్జి ఉన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులకు శిక్షణ

భీమడోలు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పూళ్ళ జిల్లా పరిషత్ హైస్కూలులో ఎన్‌సీసీ ప్రథమ సంవత్సరం సెలక్షన్స్‌లో 33 మందిని ఎంపిక చేశారు. అందులో 14 మంది బాలురు, 19 మంది బాలికలు ఉన్నారు. ఈ సెలక్షన్ కార్యక్రమాన్ని ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అమిత్ పాండే పరిశీలించారు.

క్రైమ్ కార్నర్

చెట్టును ఢీ కొట్టిన కారు

బుట్టాయగూడెం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): అదుపుతప్పిన కారు రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయి చెట్టును ఢీ కొట్టిన సంఘటన బుధవారం మర్లగూడెం మలుపులో జరిగింది. వివాహ కార్యక్రమానికి వెళ్లి తిరిగివస్తుండగా మర్లగూడెం గ్రామంలో బుట్టాయగూడెం వైపుగా వెళ్ళే మార్గంలో రోడ్డు మార్జిన్‌లోకి దూసుకుపోయి చెట్టును ఢీ కొట్టి ఆగింది. ప్రమాదం జరిగిన సమయంలో కారులో ఐదుగురు ఉండగా వృద్ధురాలు, చిన్నబాబుకు గాయాలు కాగా వెంటనే మరోక వాహనంలో జంగారెడ్డిగూడెం ప్రవేటు ఆస్పత్రికి బంధువులు తరలించారు. వివరాలు చెప్పడానికి కారులోని వారు నిరాకరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

భీమడోలు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు నుంచి భీమడోలు వైపు వస్తున్న మోటారు సైకిల్‌ను లారీ ఢీ కొన్న ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. నిడమర్రు మండలం అడవిపాలెంకి చెందిన గొర్ల రామకృష్ణ, భీమడోలుకు చెందిన కెంబూరి రామకృష్ణ మోటారు సైకిల్‌పై భీమడోలు వైపుగా వస్తుండగా భీమడోలు సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి ఈ ప్రమాదం జరిగింది. వీరిద్దరికి తీవ్ర గాయాలు అవ్వగా ఆసుపత్రికి తరలించారు. భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కేసు నమోదు

పెదపాడు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గతనెల ఐదున ఇంట్లో జరిగిన వేడుక సమయంలో లాకర్‌లోని ఐదు కాసుల బంగారు తాడు దొంగతనానికి గురైందంటూ వసంతవాడ గ్రామం అమృతలింగపేటకు చెందిన గెడ్డం శ్రీదేవి పెదపాడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేసింది. బంగారు తాడు విలువ సుమారు రూ.1.20 లక్షలు ఉంటుందని శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్సై కట్టా శారద సతీష్ తెలిపారు.

సారా, బెల్లపు ఊట స్వాధీనం

చింతలపూడి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నాగిరెడ్డిగూడెంలో ఎక్సైజ్ పోలీసులు సారా స్థావరాలపై దాడులు చేసి గ్రామానికి చెందిన దేశావతు లక్ష్మి నుంచి 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్టు సీఐ పి.అశోక్ తెలిపారు. సారా విక్రయాలకు సహకరిస్తున్న దేశావతు నాగేశ్వరరావు అనే వ్యక్తిపై పరారీ కేసు నమోదు చేశారు. ఆడమిల్లిలో సారా కేసులో వేముల గంగయ్యస్వామి అనే వ్యక్తిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. వల్లంపట్లలో సారా పరారీ కేసులో పాత నిందితురాలైన బాలిన నాగలక్ష్మి అనే మహిళను అదుపులోకి తీసుకుని చింతలపూడి కోర్టుకు హాజరుపర్చగా రిమాండ్ విధించారని సీఐ పి.అశోక్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐలు నరసింహారావు, ఖలీల్, సిబ్బంది పాల్గొన్నారు.

● బుట్టాయగూడెం : సారా తయారీకి ఉపయోగించే 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ఈఎస్‌టీఎఫ్ సీఐ ఆర్.సత్యవతి తెలిపారు. ముద్దప్పగూడెం గ్రామం సమీపంలోని చెరువు వద్ద సారా తయారీకి సిద్ధంగా ఉంచిన బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. దాడుల్లో ఎస్ఐ జి.సునీల్‌కుమార్, ఏలూరు, పోలవరం స్టేషన్ల సిబ్బంది పాల్గొన్నారు.

పొలం పిలుస్తోంది


పోలవరంలోని వ్యవసాయ క్షేత్రంలో అధికారులు

ఉంగుటూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో ట్రక్ షీటు జనరేట్ చేసిన వెంటనే ఎఫ్‌టీవో జనరేట్ అవుతుందని అనంతరం 24 గంటల్లో నగదు జమ అవుఅవుతుందని ఏవో ఎస్ఎస్ ప్రవీణ్ కుమార్ తెలిపారు. యర్రమిల్లి పాడు, నల్లమాడులో బుధవారం పొలం పిలుస్తో ంది కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 15 లోగా పంటల బీమా చేసుకోవాలన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన యువ రైతులు

ప్రకృతి వ్యవసాయంలో ఉత్తమ రైతులకు శిక్షణ ఇవ్వడం ద్వారా మరిన్ని మెళకువలు తెలుసుకో వచ్చని ప్రకృతి వ్యవసాయ సలహాదారు ఎం.చంద్రబాబు, శిక్షకుడు జి.నూకరాజు అన్నారు. వెల్లమిల్లి, నాచుగుంట ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను జిల్లా సమైక్య ఆధ్వర్యంలో ఉత్తమ రైతులకు శిక్షణలో భాగంగా పలు క్షేత్రాలను సందర్శించారు. గద్దే వెంకట రత్నం క్షేత్రంలో బీజామృతం, ద్రవ జీవామృతం, నీమాస్త్రం, అగ్ని అస్త్రం ప్రకృతి వ్యవసాయంలో భాగంగా బెల్లం తయారీని పరిశీలించారు. వెల్లమిల్లిలో పరిమి రాజేంద్ర ప్రసాద్ క్షేత్రంలో వివిధ రకాల పంటలను పండించే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు.

● పోలవరం : మొక్కజొన్న పంటలో కలుపు యాజమాన్య పద్ధతులపై వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో చేగొండపల్లిలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఏవో కె.రాంబాబు మాట్లాడుతూ విత్తనాలు విత్తేముందు అట్రాజిన్ అరకేజి పారాకాట్ అరలీటరు 200 లీటర్ల నీటిలో కలుపుకుని నేలంతా తడిసేటట్లు ఒక ఎకరానికి పిచికారీ చేసుకోవాలన్నారు. ఏరువాక సైంటిస్ట్ కె.ఫణికుమార్‌ని ఫోన్‌లో సంప్రదించి కలుపు నివారణపై రైతులకు అవగాహన కల్పించారు.

● టి.నరసాపురం: రైతులు ప్రభుత్వం అందించే పథకాలు వినియోగించుకోవాలని ఏవో బి.సుమలత అన్నారు. వెలగపాడు, అల్లంచర్లరాజుపాలెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్నకి ఒక ఎకరాకి రూ.483 బీమా ప్రీమియంను ఈ నెల 15 లోగా చెల్లించాలన్నారు. వెలగపాడు సర్పంచ్ జలపాలు, రైతుసేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● భీమడోలు : గ్రామంలోని అంబర్‌పేటలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు పంటల బీమాపై ఏడీఏ ఉషారాజకు మారి అవగాహన కల్పించారు. ఏవో ఉషారాణి, నేతలు పుల్లయ్యనాయుడు, రామా రావు, ఏసు రత్నం, రైతు సేవా కేంద్రం ఇన్‌చార్జి రాణి పాల్గొన్నారు.

సభ్యత్వంలో.. దూకుడు

(ఐదో పేజీ తరువాయి)

బ్యూరో సభ్యుడు పితాని సత్యనారాయణ ప్రాతినిధ్యం వహిస్తున్న ఆచంట నియోజకవర్గం పశ్చిమగోదావరి జిల్లాలో మూడో స్థానంలో నిలవగా ఇక్కడ 32 వేల మందికిపైగా సభ్యత్వం తీసుకున్నారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ప్రాతినిధ్యం వహిస్తున్న తణుకులో జిల్లాలో నాల్గవ స్థానం నిలబెట్టుకోగా ఇక్కడ 48 వేల మందికి పైగా సభ్యత్వం పొందారు. నరసాపురం నియోజకవర్గానికి ఐదో స్థానం దక్కగా ఇక్కడ 25 వేలకుపైగా సభ్యత్వ నమోదు జరిగింది. ఏలూరు జిల్లాలో పోలవరం, చింతలపూడి నియోజకవర్గాలు 6, 7 స్థానాల్లో ఉండగా, పశ్చిమ గోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం, భీమవరానికి ఇవే స్థానాలు దక్కాయి. సభ్యత్వ నమోదుకు ఇంకా గడువు మిగిలి ఉండడంతో సాధ్యమైనంత మేర వేగంగా దూసుకు పోయేందుకే ప్రయత్నిస్తున్నారు. సభ్యత్వ నమోదు జరిగిన తీరు పట్ల అటు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఇటు యువనేత లోకేశ్ సంతృప్తిగా ఉన్నట్టు సమాచారం.

ప్రాధాన్యతలను మరువొద్దు..

(ఐదో పేజీ తరువాయి)

స్పందించాలన్న సీఎం చంద్రబాబుతో కలెక్టర్ ఏకీభవించారు. ఈ దిశగా ఎక్కడైనా చిన్నాచితకా అవంతరాలు ఉన్నా అధిగమిస్తామని, తద్వారా రైతులకు మేలు చేకూరేలా అన్ని చర్యలు తీసుకుంటామని బదులిచ్చారు. అలాగే పోలవరం ప్రాజెక్టు పనుల పర్యవేక్షణలోను కీలకంగా వ్యవహరించాల్సిందిగా సీఎం ఆదేశించారు. పోలవరం పరిధిలో ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద చర్యలు తీసుకోవడానికి, పెండింగ్ పనులు పూర్తి చేయడానికి వీలుగా చొరవ తీసుకోవాల్సిందిగా సీఎం చంద్రబాబు సూచనలు చేశారు. రైతులకు సాగునీరు ఎంతముఖ్యమో ప్రజలకు సంక్షేమం అంతే అవసరమని ఈ దిశగా లక్ష్యాలను అధిగమించాలని కలెక్టర్లకు సూచించారు.

మార్చి 17 నుంచి టెన్త్ పరీక్షలు

ఏలూరు అర్బన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పబ్లిక్ పరీక్షలు రెగ్యులర్, ప్రైవేటు విదార్థులకు వచ్చే ఏడాది మార్చి 17నుంచి 31వతేదీ వరకు జరుగుతాయని ఏలూరు డీఈవో వెంకట లక్ష్మమ్మ, పశ్చిమ గోదావరి జిల్లా డీఈవో నారాయణ తెలిపారు. ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్ పేపర్లు మాత్రం 50 మార్కుల చొప్పున, మిగతా ప్రధాన సబ్జెక్టుల పేపర్లన్నీ 100మార్కుల చొప్పున పరీక్షలు జరుగుతాయని వివరించారు.

మార్చి 1 నుంచి ఇంటర్ పరీక్షలు

ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు థియరీ, ప్రాక్టికల్ పరీక్షల షెడ్యూల్ బుధవారం విడుదలైంది. వచ్చే ఏడాది మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీ వరకు ఉదయం 9 గంటలనుంచి మధ్యాహ్నం 12గంటలవరకు పరీక్షలు జరుగుతాయి. ఉత్తీర్ణతకు తప్పనిసరి అర్హతా పరీక్షలైన నైతికత, మానవ విలువల పరీక్ష ఫిబ్రవరి ఒకటోతేదీన, పర్యావరణ విద్య పరీక్ష ఫిబ్రవరి 3న ఉదయం 10నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు సంబంధిత కళాశాలల్లోనే నిర్వహిస్తారు. ప్రాక్టికల్ పరీక్షలు జనరల్ కోర్సులకు ఫిబ్రవరి 10నుంచి 20వరకు, ఒకేషనల్ కోర్సులకు ఫిబ్రవరి 5నుంచి 20వరకు రోజుకు రెండు సెషన్లలో ఉదయం 9నుంచి 12గంటలవరకు, మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతాయని ఇంటర్‌బోర్డు జిల్లా అధికార వర్గాలు తెలిపాయి.

ఏలూరు జిల్లాలోని 135 జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 18,449 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 15,019 మంది చదువుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని 121 జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థులు 19,762 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 17, 574 మంది చదువుతున్నారు.



శరవేగంగా డయాఫ్రం వాల్ నిర్మాణం

- 80 మీటర్ల వరకు కాంక్రీటు పనులు పూర్తి
- తవ్వకాలు జరిపేందుకు ట్రెంచ్ కట్టర్లు సిద్ధం
- వరదలకు దెబ్బతిన్న రోడ్డు 90% పూర్తి

పోలవరం డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో అతి కీలకమైన నూతన డయాఫ్రం వాల్ నిర్మాణానికి అవసరమైన గైడ్ వాల్ పనులు మంగళవారం ఊపందుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ నెల 16న ప్రాజెక్టు వద్దకు వచ్చి.. నిర్మాణ పనుల షెడ్యూల్‌ను ప్రకటించే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికారులు వివిధ కట్టడాల పనులను వేగవంతం చేశారు. నూతన డయాఫ్రం వాల్ నిర్మాణానికి అవసరమైన ప్లాట్‌ఫారాన్ని సిద్ధం చేశారు. వాల్ నిర్మాణ ప్రాంతానికి ఇరువైపులా ఐదు గైడ్‌వాల్స్ కాంక్రీట్ పనులు వేగంగా చేస్తున్నారు. ఇప్పటికే 80 మీటర్ల మేర ఈ కాంక్రీట్ పనులు పూర్తి చేశారు. గతంలో మాదిరిగా ఈసారి కూడా డయాఫ్రం వాల్‌ను 1,396 మీటర్ల పొడవున, 5 మీటర్ల వెడల్పున నిర్మిస్తున్నారు. గోదావరి అడుగున ఇసుక సిల్టు, మట్టిపొరల నుంచి ఎర్త్‌కం రాక్ ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాంలో సీపేజీ రాకుండా నివారించే ప్రక్రియలో భాగంగా నూతన వాల్ నిర్మాణం చేపట్టారు. ఇందుకోసం నదీతలం అడుగు భాగాన సుమారు 100-150 మీటర్ల లోతు వరకూ ప్రాంతాన్ని బట్టి రాతి పొరలు తగిలే వరకూ తవ్వకాలు జరిపేందుకు ట్రెంచ్ కట్టర్ యంత్రాలను సిద్ధం చేశారు. ఈ యంత్రాలను వినియోగానికి అనువుగా బిగించడానికి సుమారు 20 రోజులు పడుతుందని ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు. గత 5 నెలలుగా డయాఫ్రం వాల్ ప్రాంతంలో ఇరువైపులా శాండ్ ఫిల్లింగ్, మట్టి , ఇసుక రాతి నమూనాల సేకరణ పనులు నిర్వహిస్తున్నారు. ఈసీపీటీ యంత్రంలో కెమెరా ప్రెషర్ ద్వారా సెన్సర్‌లను భూమిలోకి పంపి ల్యాప్‌ట్యాప్ డిస్‌ప్లే ద్వారా నదిలో మట్టి, రాతి పొరల స్థితిగతుల అంచనా పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఈసీఆర్ఎఫ్ డ్యాం గ్యాప్-2 ప్రాంతంలో వైబ్రో కంపాక్షన్ పనులు నిర్వహించడం ద్వారా భూమిని గట్టిపరిచే పనులు వేగవంతంగా చేస్తున్నారు. వాల్ ప్రాంతానికి మట్టి, రాళ్లు తరలించేందుకు స్పిల్ చానల్ నదీ ప్రవాహంపై ఈ ఏడాది వరదలకు దెబ్బతిన్న రోడ్డును 90 శాతం వరకు పునరుద్ధరించారు. ప్రవాహానికి ఆటంకం లేకుండా ఈ రోడ్డు మార్గంలో పలుచోట్ల భారీ ఇనుప తూములను ఏర్పాటు చేశారు. మరో 100 మీటర్ల రోడ్డు పనులు ఈ వారంలో పూర్తవుతాయని ఈఈ వెంకటరమణ వెల్లడించారు. గైడ్‌వాల్ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఈఈ సుధాకర్, డీఈ మల్లికార్జునరావు తెలిపారు.



రాళ్ల తరలింపునకు సిద్ధమైన రోడ్డు

ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో మోటారు సైకిళ్లు మాయం

ఏలూరు క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సెక్యూరిటీ వైఫల్యంతో మోటారు సైకిళ్ళు అపహరణకు గురవుతున్నాయి. బుధవారం ఏకంగా రెండు మోటారు సైకిళ్ళు అపహరణకు గురవడంతో బాధితులు లబోదిబోమంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఉంగుటూరు మండలం నీలాద్రిపురానికి చెందిన తానంకి వినోద్‌కుమార్ ఏలూరు ప్రభుత్వాసుపత్రి తల్లీబిడ్డల విభాగంలో ఉన్న బంధువును చూసేందుకు తన కుటుంబీకులతో సహా బుధవారం సాయంత్రం వచ్చాడు. ఎంసీహెచ్ బ్లాక్ పక్కన మోటారు సైకిల్ పార్కింగ్ ప్లేసులో పార్క్ చేసి లోపలికి వెళ్ళి తిరిగి వచ్చేసరికి మోటారు సైకిల్ అపహరణకు గురైంది. అక్కడ సెక్యూరిటీ సిబ్బంది ఎవరూ లేరని బాధితుడు వాపోతున్నాడు. బుధవారం ఉదయం ఒక మోటారు సైకిల్ ఆసుపత్రి ఆవరణలోనే అపహరణకు గురవడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. సీసీ కెమెరాలు తూతూ మంత్రంగానే పనిచేస్తున్నాయి. ఆసుపత్రి అధికారులు తక్షణం సెక్యూరిటీని ప్రక్షాళన చేసి ఆసుపత్రికి వచ్చే వాహనాలకు రక్షణ కల్పించాలి. సీసీ కెమెరాలకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి చర్యలు తీసుకోవాలి.

బ్యూటీషియన్ మరణానికే భర్తే కారణం !

ఏలూరు క్రైం, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): బ్యూటీషియన్ మరణానికి ఆమె భర్తే కారణమని ఏలూరు టూ టౌన్ పోలీసులు బుధవారం అతనిని అరెస్టు చేశారు. ఏలూరు వంగాయిగూడెం ప్రాంతానికి చెందిన కాలి ప్రియాంక(25) హైదరాబాద్‌లో బ్యూటీషియన్‌గా పనిచేసేది. ఆమె తండ్రి ఏడాదిన్నర క్రితం అనారోగ్యంతో ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. తండ్రికి సహాయంగా ఉన్న ప్రియాంకతో ఆసుపత్రిలో ఔట్‌సోర్సింగ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న కండ్రికగూడెంకు చెందిన తెల్లం శ్రీకాంత్ ప్రియాంకను పరిచయం చేసుకున్నాడు. తనకు ఇంకా వివాహం కాలేదని ఆమెను పెళ్లి చేసుకుని ఏలూరు కట్టా సుబ్బారావు వీధిలోని ఒక ఇంటిని అద్దెకు తీసుకుని అక్కడ కాపురం పెట్టాడు. అయితే అప్పటికే శ్రీకాంత్‌కు అదే ఆసుపత్రిలో పనిచేసే ఒక నర్సును పెళ్ళి చేసుకున్నాడన్న విషయంపై వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ప్రియాంక వద్ద లక్షలాది రూపాయలు తీసుకోవడంతో గొడవలు మరింత ఎక్కువయ్యాయి. ప్రియాంక మనస్థాపానికి గురై ఈ నెల 1న ఉరి వేసుకుని అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. ఈ ఘటనపై ఏలూరు టూటౌన్ సీఐ వైవీ రమణ ఆధ్వర్యంలో ఎస్ఐ నాగకల్యాణి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె మరణానికి భర్తే కారణమంటూ బుధవారం అతనిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపర్చగా 14 రోజులు కోర్టు రిమాండ్ విధించింది. దీంతో అతనిని జిల్లా జైలుకు తరలించారు.

వైభవంగా సహస్ర లింగార్చన

ముదినేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): షష్టి కల్యాణోత్సవాల సందర్భంగా ముదినేపల్లి మండలం సింగరాయపాలెం - చేవూరుపాలెం సెంటర్‌లోని వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యే శ్వరస్వామి దేవస్థానంలో బుధవారం సహస్ర దీపారాధనలు, సహస్ర లింగార్చన పూజలు వైభవంగా జరిగాయి. దశమి, ఏకాదశి తిథి ద్వయం సమయంలో ఆలయంలో స్వామివార్లకు, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం పూజలు, అభిషేకాలను అర్చకులు తోలేటి వీరభద్ర శర్మ, గూడూరు రామకృష్ణ శర్మ నిర్వహించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు బొంగు రవి కుమార్, బూరుబోయిన సోవమ్మ, కొట్టి సుబ్బ



సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో సహస్ర లింగార్చన



సింగరాయపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో సహస్ర దీపారాధన పూజలు

లక్ష్మి, దగాని నాగలక్ష్మి తదితరులు పూజలు నిర్వ హించిన అనంతరం వందలాది మంది మహిళ లు సహస్ర దీపారాధనల పూజలు జరిపారు. శివ లింగార్చన ఆకట్టుకుంది. శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు దంపతులు పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. దేవరకోట జై మారుతీ దళం నిర్వహించిన లక్ష్మీ తిరు పతమ్మ అమ్మవారి బుర్రకథ ఆకట్టుకుంది.

పెదలంకలో ఉత్సవాలు

కలిదిండి : పెదలంకలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని బుధవారం పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామిని దర్శించుకున్నారు. అయ్యప్ప మాల ధారులు స్వామి సన్నిధిలో పడి భజన నిర్వహించారు. ఈవో శేఖర్, ఉత్సవ కమిటీ సభ్యులు ఎం.బుల్లి వెంకయ్య, డి.నాగు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

వైభవంగా సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ



ముదినేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో నూతనంగా నిర్మించిన షిర్డీ సాయి బాబా మందిరంలో బుధవారం గ్రామానికి చెందిన సుదాబత్తుల నాగమల్లేశ్వరరావు, వరలక్ష్మి దంపతులు యాజ్ఞీకుడు ఆసూరి రంగ నాథాచార్యులు ఆధ్వర్యంలో సాయిబాబా విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. వందలాది మంది భక్తులు బాబాకు పూజలు జరిపారు. ఆలయ నిర్మాణ, విగ్రహ దాతలు అడపాల నాగ ప్రసాద్, సూదాబత్తుల బాల కృష్ణ దంపతులతో పాటు పలువురు పూజలు జరిపారు. అన్నసమారాధన నిర్వహించారు.

ఘనంగా గీతా జయంతి

ముదినేపల్లి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వడాలిలోని సుభద్ర, బలరామ సహిత శ్రీ జగన్నాథస్వామి దేవస్థానంలో బుధవారం గీతా జయంతి వైభవంగా జరిగింది. జగన్నాథ స్వామికి పూజలు జరిపిన అనంతరం ఆలయ ప్రాంగణంలో పెడన మండలం నరసప్ప చెరువుకు చెందిన మానికొండ నాగలక్ష్మి ఆధ్వర్యంలో సుమారు 120 మంది మహిళలు భగవద్గీత శ్లోకాలను మూడు గంటల పాటు ఆలపించారు. కృష్ణా, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని వివిధ ప్రాంతాలకు చెందిన మహిళలు ఏకరూప దుస్తులతో నిర్వహించిన గీతా పారాయణం ఆకట్టుకుంది. ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు గీతా జయంతి పూజలు నిర్వహించారు.

'మాదిగల ఆత్మీయ సభను విజయవంతం చేయండి'

ముసునూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): మాదిగల ఆత్మీయ కలయిక బహిరంగ సభను విజయవంతం చేయాలని నూజివీడు నియోజకవర్గ మాదిగల ఐక్య కార్యాచరణ సమితి కన్వీనర్, తెలుగు యువత కార్యదర్శి కొండేటి ఉదయ్‌కిరణ్(బాబి) పిలుపు నిచ్చారు. బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న నూజివీడు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో జరిగే బహిరంగ సభకు ఎమ్మార్పీయస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ, రాష్ట్ర గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర రక్షణశాఖ మంత్రితో పాటు మరికొంత మంది ప్రముఖులు ముఖ్య అతిథులుగా విచ్చేస్తున్నారన్నారు. ఉదయం 9 గంటలకు రాజీవ్ సర్కిల్ నుండి సభ ప్రాంగణం వరకు బారీ ర్యాలీ జరుగుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర ప్రభుత్వం త్వరగా అమలు పరచాలని విజ్ఞప్తి చేసేందుకు జరుగుతున్న ఈ బహిరంగ సభకు నియోజకవర్గంలో ఉన్న మాదిగలు వేలాదిగా తరలిరావాలని బాబి కోరారు. కో-కన్వీనర్లు కంచర్ల లవకుమార్, ముళ్ళపూడి రామారావు, గద్దల మోహన్‌రావు, ఎమ్మార్పీయస్ నియోజకవర్గ అధ్యక్షులు దుబ్బాక దేవరాజు తదితరులు పాల్గొన్నారు.



కుమ్మరివారి బజారు రోడ్డుకు మహర్దశ

ముసునూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రమణక్కపేటలో అధ్వానంగా ఉన్న కుమ్మరివారి బజారును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. ఈ రహదారిని పంచాయతీ రాజ్ ఏఈ దుర్గాప్రసాద్, టీడీపీ యువ నాయకుడు రంగు శ్రీనివాసరావు, నియోజకవర్గ జనసేన నాయకుడు పాశం నాగబాబు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుమ్మరివారి బజారు రోడ్డు వాగులా ఉండటంతోపాటు నివాస గృహాల్లో వర్షపునీరు పోయే పరిస్థితి లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. గత వైసీపీ హయాంలో స్థానికులు అధికారులకు ఎన్ని వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే సీసీ రోడ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టిందని, దీంతో పల్లెల్లో పండుగ వాతా వరణం నెలకొందన్నారు. పీఆర్ ఏఈ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో నూతన సీసీ రోడ్ల నిర్మాణాలు నాణ్యతా ప్రమాణాలతో శరవేగంగా జరుగుతున్నాయన్నారు.



కొట్టాడ రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి నాగలింగాచార్యులు

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

కైకలూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తోందని మండల ప్రత్యేక అధికారి కేఎస్‌వీ నాగలింగాచార్యులు అన్నారు. కొట్టాడలో బుధవారం రెవెన్యూ గ్రామసభలను ప్రారంభించారు. భూ సమస్యలపై 25 ఫిర్యాదులను అధికారులు స్వీకరించారు. ఇన్‌చార్జి తహసీల్దార్ ఎండీ ఇబ్రహీం, రాష్ట్ర వడ్డీసాధికారిక సమితి కన్వీనర్ బలే ఏసురాజు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పెదలంకలో 120 అర్జీలు

కలిదిండి : పెదలంకలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సుకు భూ సమస్యలపై 130 అర్జీ లు వచ్చాయని తహసీల్దార్ రామకృష్ణ తెలి పారు. 45 రోజుల్లో భూ సమస్యల పరిష్కా రానికి చర్యలు తీసుకుంటామన్నారు. మండ ల ప్రత్యేకాధికారి భాస్కర్, టీడీపీ మండల అధ్యక్షుడు జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, డీసీ మాజీ చైర్మన్ భోగేశ్వరరావు, వెంకటాచలం, సర్పంచ్ లక్ష్మీ రామకృష్ణ పాల్గొన్నారు.



పెదలంక రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

ముసునూరు, డిసెంబరు 11(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను శాశ్వత పరిష్కారాన్ని చూపేందుకు ప్రభుత్వం రెవిన్యూ గ్రామ సభలను నిర్వహిస్తుందని తహసీల్దార్ కె.రాజ్ కుమార్ అన్నారు. బుధవారం లోపూడి గ్రామ సచివాలయం వద్ద గ్రామసభను నిర్వహించి, భూసమస్యలపై తహసీల్దార్ ఆర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలపై రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వీటిని పరిష్కరించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ గ్రామసభలో వివిధ భూసమస్యలపై 70 ఆర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



జనార్దనవరం రెవెన్యూ సదస్సులో అర్జీ స్వీకారం

చాట్రాయి: మండలంలోని జనార్దనవరం సచివాలయంలో బుధవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 6 అర్జీలు అందినట్టు అధికారులు చెప్పారు. మండల ప్రత్యేకాధికారి వెంకటరత్నం, తహసీల్దార్ ప్రశాంతి, మాజీ సర్పంచ్‌లు పామర్తి నాగేశ్వరరావు, పలగాని దుర్గారావు, టీడీపీ నాయకులు మాదాసు చంద్రకళ, కలకొండ భాస్కరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులు అగ్రిమెంట్ చేసుకోవాలి

నూజివీడు టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నూజివీడు మండలంలో 1,020 ఎకరాల్లో రబీ విత్తన మొక్కజొన్న సాగులో ఉందని ప్రతి రైతు సంబంధిత కంపెనీలతో ఒప్పందం చేసుకోవాలని ఏవో ఆలూరి చాముండేశ్వరి సూచించారు. నూజివీడు మం డలం రావిచర్ల, పాత రావిచర్లతో పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 రోజుల మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు కనిపిస్తుందని దాని నివారణకు మేంక్టిన్ బయోజోయెట్ ఒక ఎంఎల్ లీటర్ నీటిలో కలిపి పిచికారి చేసుకోవాలన్నారు. అదే విధంగా ఎకరానికి రూ.483లు బీమా ప్రీమియం చెల్లించి బీమా పొందవచ్చని చెప్పారు. ఉద్యాన శాఖ అధికారిని ఆర్.హేమ మాట్లాడుతూ మామిడిలో బీమా ప్రీమియం ఎకరానికి రూ.2,250లు చెల్లించి వాతావరణ ఆధారిత పంటల బీమా పొందాలని సూచించారు.



మాట్లాడుతున్న ఏవో చాముండేశ్వరి

కలుపు మందులు ఎక్కువగా వాడవద్దు

చాట్రాయి: కలుపు మందులు ఎక్కువగా వాడటం వలన భూమి సహజత్వం కోల్పోయి దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని ఏవో శివ శంకర్ అన్నారు. పొలం పిలుస్తోందిలో భాగంగా బుధవారం చాట్రాయిలో రైతులతో కలిసి ఏవో మొక్కజొన్న తోటలను పరిశీలించారు. రబీలో భూమి దున్నకుండా జీరో టిల్లెస్ విధానంలో మొక్కజొన్న సాగు చేయటం వల్ల ఎకరానికి రూ. 4 వేలు ఆదా అవుతుందని, విత్తనాలు నాటే ముందు విత్తన శుద్ధి చేస్తే 20 రోజుల వరకు పైరుకు ఎటువంటి పురుగు ఆశించకుండా కాపాడుకోవచ్చునని అన్నారు.

పొగాకు పంటను నష్టపరుస్తున్న లద్దె పురుగు

ముసునూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): పొగాకు పంటను లద్దె పురుగు తీవ్రంగా నష్టపరుస్తోందని మండల వ్యవసాయ అధికారి ఎస్.మధు మోహన్ అన్నారు. ముసునూరులో పొగాకు పంటను బుధవారం ఆయన పరిశీ లించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రస్తుతం పొగాకు పంటలో లద్దె పురుగు ఉధృతి అక్కడక్కడ కనిపిస్తోందన్నారు. పిల్ల పురుగులు గుంపులుగా ఆకులను తీనివేయడంతో జల్లెడగా మారుతున్నాయన్నారు. దీని నివారణకు లోతైన వేసవి దుక్కులు, తక్కువ మోతాదులో యూరియా వాడకం, ఎర పంటలు, లింగార్షక బుట్టలు, ట్రైకోగామా పరాన్నజీవి గుడ్లును వదలటం వంటి సమగ్ర పురుగుల యాజమాన్య పద్ధతులను రైతులు పాటించాలని ఏవో సూచించారు. లద్దె పురుగులు చిన్నవిగా ఉన్నప్పుడు 5 శాతం వేపగింజల కషాయంను వాడాలని, పురుగులు పెద్దవిగా ఉన్నప్పుడు డెలిగేట్ 100 మిల్లీ లీటర్ల మందును 500 మిల్లీ లీటర్ల వేపనూనె, లేదా ఎవిసెంట్ 24 గ్రాముల మందును 500 మిల్లీ లీటర్ల వేపనూనెతో కలిపి 100 లీటర్ల ద్రావణాన్ని ఒక ఎకరానికి పిచికారి చేస్తే పొగాకులో లద్దె పురుగును సమర్థవంతంగా నివారించుకోవచ్చని వివరించారు.



ముసునూరులో పొగాకు పంటను పరిశీలిస్తున్న ఏవో



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ట్రైనీ కార్యదర్శి ఆసిఫ్

గ్రామాల అభివృద్ధిపై శిక్షణ తరగతులు

కలిదిండి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం గ్రామాల అభివృద్ధి ప్రణాళికలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. గ్రామాల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి దశలవారీగా గ్రామాలను అభివృద్ధి చేయడానికి సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కృషి చేయాలని ట్రైనర్ కార్యదర్శులు ఆసిఫ్ సూచించారు.

గ్రామాల అభివృద్ధికి అందరూ సహకరించాలి

కైకలూరు, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధి ప్రణాళికబద్ధంగా జరగాలని ఎంపీపీ అడవి వెంకట కృష్ణమోహన్ అన్నారు. కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం మండలంలోని సర్పంచ్‌లకు, అధికారులకు గ్రామాభివృద్ధిపై ఒక రోజు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామస్థాయిలో అందరూ కలిసిగట్టుగా పనిచేసి అభివృద్ధికి పునాదులు వేయాలని అన్నారు. శిక్షణా తరగతుల్లో సూచనలను సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు తుచా తప్పకుండా పాటించాలన్నారు.ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు చెరుకువాడ బలరామ రా జు, కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆక్సిజన్ లోపించకుండా చర్యలు చేపట్టాలి

కలిదిండి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులతో ఆకాశం మేఘావృతమై ఉండటంతో చేపల, రొయ్యల చెరువుల్లో ఆక్సిజన్ లోపించకుండా చర్యలు తీసుకోవాలని మత్స్యశాఖాధికారి నూరెళ్ల అన్నారు. బుధవారం సంతోషపురం, భాస్క రావు పేట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువుల్లో ఆక్సిజన్ ఉత్పన్నమవ్వడానికి నిరంతరాయంగా ఏరియేటర్లు తిరిగే విధంగాలా తీసుకోవాలన్నారు. ఆక్సిజన్ టాబ్లెట్స్ నిల్వ ఉంచుకోవాలన్నారు. వాతావరణం చల్లగా ఉన్నప్పుడు మేతలు తక్కువగా వేయాలన్నారు. కూటమి నాయకులు, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి సారథి

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోండి

నూజివీడు టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించే దిశగా ఈ నెల 20న నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని సమాచార పౌర సంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి కోరారు. జాబ్ మేళా పోస్టర్‌ను ఆయన బుధవారం ఆవిష్కరించి మాట్లాడుతూ మొత్తం 40 కంపెనీలు ఇందులో పాల్గొంటాయని టెన్త్ నుంచి డిగ్రీ, బి.టెక్ తదితర కోర్సులు పూర్తి చేసిన వారు పాల్గొనవచ్చునని, నూజివీడు ట్రిపుల్ ఐటీలోని శాక్ బిల్డింగ్‌లో ఈ మేళా నిర్వహిస్తారన్నారు.

రేపు మామిడి మార్కెట్ ఏర్పాటుపై సమావేశం

చాట్రాయి/నూజివీడు టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): నూజివీడులో మామిడి మార్కెట్ ఏర్పాటుపై ఈ నెల 13న ఉదయం 10.00 గంటలకు నూజివీడు మార్కెట్ యార్డులో జరిగే సమావేశానికి మామిడి రైతులు, వ్యాపారులు హాజరుకావాలని ఉద్యానవన శాఖ అధికారి హేమ కోరారు. రాష్ట్ర అగ్రికల్చర్ మార్కెటింగ్ డైరెక్టర్ ఎం. విజయ సునీత రైతులు, వ్యాపారుల సలహాలు సూచనలు తీసుకుంటారన్నారు.

చురుగ్గా సీసీ రోడ్డు నిర్మాణం

చాట్రాయి, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడులో రూ. 8.30 లక్షల ఉపాధి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. నూజివీడు ఎమ్మెల్యే, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఎన్నికల హామీ మేరకు నిధులు మంజూరు చేయటం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కడప స్టీల్ ప్లాంట్ పూర్తి చేయాలి

నూజివీడు టౌన్, డిసెంబరు 11 (ఆంధ్రజ్యోతి): కడప స్టీల్ ప్లాంట్‌ను వేగవంతంగా పూర్తి చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోళ్ల పవన్ డిమాండ్ చేశారు. నూజివీడులో ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం జగన్, ప్రస్తుత సీఎం చంద్రబాబులు కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణంకు పోటా పోటీగా శంకుస్థాపన చేశారని స్టీల్ ప్లాంట్ నిర్మాణం మాత్రం ముందడుగు పడలేదన్నారు. చంద్రబాబు హామీ మేరకు విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను నిలిపివేయడంతో పాటు కడప స్టీల్ ప్లాంట్‌ను పూర్తి చేయాలన్నారు.